పెన్ పవర్
తెలంగాణ రౌండప్



# పెట్టుబడులకు గమ్యస్థానం హైదరాబాద్

## హైదరాబాద్ సమిట్ ఆత్మీయ విందులో ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్ పెన్ పవర్:** పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానమని, తెలంగాణ పారిశ్రామికంగా, సాంకేతికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళ, బుధవారాల్లో గ్రీన్ గ్రోత్ ఎనర్జీ సమిట్- 2026 నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం రాత్రి హైటెక్స్ నోవాటెల్‌లో విదేశీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో ఆయన పాల్గొన్నారు. 'హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది.' అని పేర్కొన్నారు. ఇందులో ఈ కార్యక్రమం నిర్వాహకురాలు రిత్విక బట్టాచార్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 50% రిజర్వేషన్ల సాధనకు పోరాటం

## ఆగస్టు 6న భారీ బహిరంగ సభ: కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ పెన్ పవర్:** బీసీలకు 50% రిజర్వేషన్లు సాధించేందుకు పోరాటం చేస్తామని..దీనిపై ఆగస్టు 6న హైదరాబాద్‌లో 'సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. "ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బీసీలకు 50% రిజర్వేషన్ల సాధనకు పోరాటం చేస్తాం. బీసీలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల వారిని ఒక్కతాటిపైకి తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతాం. బీసీలకు 50% రిజర్వేషన్ల సాధన సభ దేశ గతినే మార్చేస్తుంది. మేం చేసిన ఉద్యమాలకు తలొగ్గే.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42%, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించేలా రెండు వేర్వేరు బిల్లులు అసెంబ్లీ, కౌన్సిల్‌లో పాస్ చేసి కేంద్రానికి పంపింది. కానీ, ఆ బిల్లులకు కేంద్రం ఆమోదం తెలిపేలా రాష్ట్రప్రభుత్వం కనీస ప్రయత్నాలు కూడా చేయడం లేదు" అని కవిత విమర్శించారు.

# ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయండి

## సీఎంకు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి లేఖ



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో 20వేల పోలీస్ ఖాళీలు ఉండగా.. ప్రభుత్వం కేవలం 7,437 పోస్టులకే నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని, ఉద్యోగాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగలేఖ రాశారు. "రాష్ట్రంలో 30లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఉద్యోగాలపై ప్రభుత్వం వారిని తప్పుదోవ పట్టిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలఖాళీలు, నోటిఫికేషన్లు, నియామకాలు, పెండింగ్ పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి. కాంగ్రెస్ యువజన డిక్లరేషన్‌లో మొదటిఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలి. హైదరాబాద్ కమిషనరేట్లలో ఎక్కువ పోస్టులు ఉండటంతో ఆదిలాబాద్, నిర్మల్, నారాయణపేట్, గద్వాల్ వంటి జిల్లాల అభ్యర్థులకు అవకాశాలు తగ్గుతున్నాయి. ఎన్నికల ముందు కాంగ్రెస్ జీవో 46 రద్దు చేస్తామని హామీ ఇచ్చి చర్యలు తీసుకోలేదు. నోటిఫికేషన్ల ఆలస్యం కారణంగా వేలమంది నిరుద్యోగులు వయోపరిమితిని దాటిపోతున్నారు. జీవో87పై తక్షణ నిర్ణయం తీసుకోవాలి. నిరుద్యోగులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి" అని లేఖలో డిమాండ్ చేశారు.

# త్వరలో ములుగులో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

## మేడారం పనులపై మంత్రి సీతక్క సీరియస్



**హైదరాబాద్ పెన్ పవర్:** త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ములుగు, మేడారం ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లు, జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితులపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో ఇవాళ కీలక చర్చలు జరిపారు. ముఖ్యంగా మేడారం అభివృద్ధి పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను రాబోయే 10 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోనున్నారు. అనంతరం జిల్లాలో పలు భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. దాదాపు 6,000 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో చేపట్టనున్న పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి పనులను సీఎం ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఘట్టమ్మ సమీపంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పర్యటనలోనే ములుగు కలెక్టరేట్ భవనం, మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, కేంద్రీయ విద్యాలయం లాంటి ప్రతిష్టాత్మక అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరగనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించిన అధికారిక తేదీని త్వరలోనే ప్రకటిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు.



# ఇందిరమ్మ ఇండ్ల పథకంను పీఎం కూడా మెచ్చుకున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా మండల కేంద్రమైన ములుగులో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం వైభవంగా జరిగింది. అర్హులైన లబ్ధిదారులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి కలిసి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పేద ప్రజల సొంత ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక గొప్ప కార్యక్రమమని కొనియాడారు. ముఖ్యమంత్రి ప్రధానమంత్రిని కలిసినప్పుడు కూడా.. ఈ ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా గొప్పదని, దీనిని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని పీఎం స్వయంగా అభినందించారని మంత్రి గుర్తు చేశారు. కేవలం రెండో విడతతోనే ఆగకుండా.. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి ఇస్తామని వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు, మధ్యవర్తులు లేకుండా పారదర్శకంగా ఈ ఇండ్లను అందజేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో లేని అనేక ప్రజా సంక్షేమ పథకాలను కూడా రూపొందించి ప్రజలకు అందిస్తున్నామని ఆయన వెల్లడించారు. పేదలకు ఏ విధంగా అండగా నిలవాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బాగా తెలుసని, అందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నొక్కి చెప్పారు. అందుకే దేశవ్యాప్తంగా చాలా మంది ఈ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నారని అన్నారు.

# ఉద్యమకారులకు గౌరవం దక్కాలనేదే సర్కారు లక్ష్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ఉద్యమకారులందరికీ గౌరవం దక్కాలనేదే ప్రభుత్వ ఆలోచన అని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కె.కేశవరావు పేర్కొన్నారు. 1969 నుంచి తెలంగాణ సాధించే దాకా జరిగిన ఉద్యమాల్లో భాగస్వాములైన అందరి అభిప్రాయాలు సేకరించి.. తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట ఉన్న అమరుల స్మారక భవనంలో కమిటీ సోమవారం తొలిసారిగా సమావేశమైంది. దీనికి హాజరైన ఉస్మానియా వర్సిటీ విద్యార్థి ఉద్యమకారులు 58 మంది కమిటీ ముందు పలు అంశాలను ఉంచారు. తెలంగాణ సాధనకే తప్ప 250 గజాల స్థలం కోసం తాము ఉద్యమం చేయలేదన్నారు. ప్రభుత్వమే స్థలం ఇస్తామని హామీ ఇచ్చిందని, అందులో ఇళ్లు కూడా నిర్మించాలని కోరారు. ఉద్యమకారులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, హెల్త్ కార్డులు, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అమరుల కుటుంబాలను ప్రత్యేకంగా ఆదుకోవాలని కోరారు. కమిటీ ఛైర్మన్ కేశవరావు మాట్లాడుతూ.. నెలాఖరు వరకు రాతపూర్వకంగా, ఆన్‌లైన్ ద్వారా అభిప్రాయాల సేకరణ చేపడతామని, ఉద్యమకారులను గుర్తించడం ఎలా అనే అంశాలపై సూచనలు పంపాలని కోరారు. ఈ నెల 7న కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, 8న ఇతర వర్సిటీలు, 9న 1969 నాటి ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఎమ్మెల్సీలు కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్‌రెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఉద్యమకారులు మానవతారాయ్, పిడమర్తి రవి, నిజ్జన రమేశ్, బట్టు శ్రీహరి, భాస్కర్, డా.డి.స్వప్న పాల్గొన్నారు.

# 'కన్నెపల్లి'లో ప్రమాదం జరిగితే మాదే బాధ్యత



**హైదరాబాద్ పెన్ పవర్:** కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటార్లు ప్రారంభించి.. 150 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. నీరు నిల్వ చేయడం చేతగాకపోతే కేసీఆర్‌కు అప్పగించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఉత్తమ్ చెబుతున్నట్లుగా ఏమైనా ప్రమాదం జరిగితే.. అందుకు భారాస పార్టీ బాధ్యత తీసుకుంటుందని, భారాసను రద్దు చేసి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటామని స్పష్టంచేశారు. మంత్రి ఉత్తమ్ అడిగినా.. మొత్తం క్యాబినెట్ కోరినా.. తెలంగాణ ప్రజల తరఫున కేసీఆర్ అండర్ టేకింగ్ రాసిస్తారని పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో భారాస నేతలు గంగుల కమలాకర్, బోయినపల్లి వినోద్‌కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. "తెలంగాణ భూములను కాపాడేందుకు కన్నెపల్లి సిద్ధంగా ఉందని కళ్లకు కట్టినట్లు కేటీఆర్ చూపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశించాం. అయినా మంత్రులు అవగాహన లేకుండా పాతపాటే పాడుతున్నారు. 95 శాతం కాళేశ్వరం ప్రాజెక్టును రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉపయోగిస్తోంది. నీటిని ఎత్తిపోయకపోతే మళ్లీ చలో కన్నెపల్లి, ఎల్లంపల్లికి పిలుపునిస్తాం" అని హెచ్చరించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# జూలై 17 నుండి 19 వరకు శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు ఈ నెల జూలై 17 నుండి 19వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో మూడు రోజుల పాటు విశేష పూజలు, స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవలు, వాహనసేవలు భక్తిశ్రద్ధలతో జరగనున్నాయి.

**స్నపన తిరుమంజనం -- ఊంజల్ సేవ**

ప్రతిరోజూ ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు స్వామివారికి ఊంజల్ సేవ వైభవంగా జరుగుతుంది.

**మూడు రోజులపాటు దివ్య వాహనసేవలు**

మహోత్సవాల్లో భాగంగా జూలై 17న పెద్దశేష వాహనం, జూలై 18న హనుమంత వాహనం, జూలై 19న గరుడ వాహనంపై స్వామివారు రాత్రి 7 నుండి 8 గంటల వరకు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.

**జూలై 16న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం**

ఉత్సవాలకు ముందుగా జూలై 16న ఉదయం 6.30 నుండి 11.30 గంటల వరకు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణం, గర్భాలయం, పూజా సామగ్రిని పవిత్ర జలాలతో శుద్ధి చేసి, సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర తీర్థాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

**జూలై 20న పార్వేట ఉత్సవం**

సాక్షాత్కార వైభవోత్సవాల ముగింపు సందర్భంగా జూలై 20న శ్రీవారిమెట్టు సమీపంలోని మండపంలో ఉదయం 7 గంటలకు పార్వేట ఉత్సవం మరియు ప్రత్యేక ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు.

**కొన్ని ఆర్జిత సేవలు రద్దు**

ఉత్సవాల దృష్ట్యా జూలై 16న తిరుప్పావడ సేవ, అలాగే జూలై 16 నుండి 20వ తేదీ వరకు ఆర్జిత కల్యాణోత్సవం సేవలను టీటీడీ రద్దు చేసింది.

**భక్తి సంగీత కార్యక్రమాలు**

మహోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**సాక్షాత్కార వైభవోత్సవాల చారిత్రక విశిష్టత**

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి 14వ శతాబ్దం నుంచే విశిష్ట చారిత్రక ప్రాశస్త్యం ఉంది.

విజయనగర రాజుల కాలం నుండి వేదపారాయణం, పూజా కైంకర్యాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అనంతరం శ్రీ తాళ్లపాక చిన తిరుమలాచార్యులు ఆలయాన్ని పునరుద్ధరించి పూజలను పునఃప్రారంభించారు.

1940లో స్వామివారి దివ్య ఆదేశంతో ఆలయ పునరుద్ధరణ జరగగా, ఆషాఢ శుద్ధ షష్ఠి రోజున తొలి పూజ నిర్వహించబడింది. అప్పటి నుండి ఆ దివ్య ఘట్టాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం “సాక్షాత్కార వైభవం” పేరిట ఈ మహోత్సవాలను టీటీడీ అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది.




## ముత్తంగి వద్ద భారీగా రేషన్ బియ్యం పట్టివేత

**సంగారెడ్డి: పెన్ పవర్:** ముత్తంగి ముంబై జాతీయ రహదారి వద్ద ఎపోట్వ పోలీసులు వాహనాల తనిఖీలు ,లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టివేసారు. 21క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. సికింద్రాబాద్ మచ్చ బొల్లారం నుండి గుజరాత్ రాష్ట్రం తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యం లారీని స్థానికంగా ఉన్న శ్రీరామ్ గోదాంకు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరుమృతి

**శంషాబాద్: పెన్ పవర్:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై మరో రోడ్డు ప్రమాదం జరిగింది. శంషాబాద్ సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుండి ఢీకొట్టింది. ప్రమాదంలో కారులోని ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మహిళ, చిన్నారి, మరో ముగ్గురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు.

## మద్యం మత్తులో ట్రాక్టర్ చోరీ

**కామారెడ్డి: పెన్ పవర్:** నలుగురు యువకులు మద్యం మత్తులో గ్రామపంచాయితీ ట్రాక్టర్ ను ఎత్తుకెళ్లారు. కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామంలో ఫుల్ గా మద్యం సేవించి గ్రామ పంచాయతీకి సంబంధించిన చెత్త ట్రాక్టర్ ను ఎత్తుకెళ్లారు. గ్రామపంచాయితీ కార్యాలయం ఆవరణలో పార్కింగ్ చేసిన ట్రాక్టర్ ను దొంగతనం చేసి తీసుకెళ్తున్న క్రమంలో గ్రామ పంచాయితీ ప్రహరీ గోడను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో గోడ ధ్వంసం అయింది. దొంగతనంకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. గ్రామ సర్పంచ్ సాయగౌడ్, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకొని దేహశుద్ధి చేసారు. మరో ముగ్గురు పరారీలో వున్నారు. మద్యం మత్తులో దొంగతనానికి పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎల్కతుర్తి రోడ్డుకు మంత్రి పొన్నం శంకుస్థాపన

**హైదరాబాద్ పెన్ పవర్:**

ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి రోడ్డు కు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసారు. మంత్రి మాట్లాడుతూఇ ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, వైస్ చైర్మన్ జిల్లా కలెక్టర్ లకు మా స్థానిక నాయకుల తరుపున ధన్యవాదాలుని అన్నారు.

ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి రోడ్డు కు ఈరోజు శంకుస్థాపన చేసుకోవడం జరిగింది.. త్వరగా పనులు పూర్తి చేయాలి. రోడ్డు పూర్తయితే చుట్టుపక్కల భూముల ధరలు కూడా పెరుగుతాయి. ఎల్కతుర్తి లో కోర్టు వస్తుంది,సబ్ స్టేషన్ వస్తుందని అన్నారు.

భవిష్యత్ లో ఎల్కతుర్తి అభివృద్ధిలో ముందు ఉంటుంది. ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి రోడ్డు పూర్తయితే అన్ని విధాలుగా ఉపయోగపడుతుంది. మండలంలో పెండింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని అన్నారు.

## చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

**హైదరాబాద్ పెన్ పవర్:** బంజారాహిల్స్ లోని కళింగ కల్చరల్ సెంటర్లో ఏర్పాటైన జాతీయ చేనేత వస్త్రప్రదర్శ సోషలైట్ యెనుగు శైలజారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి హాల్లో కొలువుదీరిన చేనేతకారుల వస్త్ర ఉత్పత్తులను తిలకిస్తూ చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలివిడిగా తిరిగారు. చేనేత ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదని, నేటితరం యువతకూడా హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని శైలజారెడ్డి అన్నారు. నిర్వాహకులు జయేశ్రుప్తా మాట్లాడుతూ..ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శన దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 74 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

## జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్

**హైదరాబాద్ పెన్ పవర్:**

జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భక్తుల కోసం మూడు రోజుల పాటు శ్రీ హనుమాన్ కథ ఉంటుంది. హైదరాబాద్లో తొలిసారి బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి కార్యక్రమం నిర్వహించనున్నారు. బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి తొలిసారిగా హైదరాబాద్లో నిర్వహించనున్న మూడు రోజుల కార్యక్రమాల కోసం సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నిర్వాహకులు అంజనీ కుమార్ అగర్వాల్, సూర్య కమల్ గుప్తా, సంజయ్ అగర్వాల్, రాకేష్ జలాన్, రాకేష్ నర్సింగ్‌పురియా, సందీప్ మిత్తల్, ఘనశ్యామ్ అగర్వాల్, నవీన్ అగర్వాల్, పవన్ తిబ్రేవాల్, అంకిత్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, రూపేష్ అగర్వాల్, శుభమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు జూలై 17, 18, 19 తేదీలలో గగన్ పహాడ్‌లోని పురాన్ సన్స్ ఫార్మ్స్ (ప్రెస్టీజ్ సిటీ గేట్ ఎదురుగా) జరగనున్నాయి. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని హైదరాబాద్ బాగేశ్వర్ ధామ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛంద సేవకుల సమావేశంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పాటించాల్సిన నియమాలు, సేవా విధానాలు, బాధ్యతల గురించి వారికి విపులంగా వివరించారు. పురాన్ సన్స్ ఫార్మ్స్‌లో పండిత్ సంజయ్ శర్మ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం జరిగిన స్వచ్ఛంద సేవకుల సమావేశంలో కన్వీనర్ అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇంతటి భారీ స్థాయిలో ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమం తొలిసారిగా నిర్వహించబడుతోందన్నారు. అందరూ సమష్టిగా కృషి చేసి ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. బాగేశ్వర్ ధామ్ నుంచి 60 మంది సభ్యుల బృందం, అలాగే ఇతర ప్రాంతాల నుంచి 500 మంది రానున్నారని, వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. జూలై 16 నుంచి 19 వరకు స్వచ్ఛంద సేవకులు విధుల్లో ఉండాలని సూచించారు. సేవలందించిన ప్రతి స్వచ్ఛంద సేవకునికి 'బాబా' తరపున ప్రత్యేక ప్రశంసాపత్రం (సర్టిఫికేట్) అందిస్తామన్నారు.

# ఇక రేవంతు... రంగంలోకి...



**హైదరాబాద్ , 6 పెన్ పవర్:** 31 నెలలుగా ప్రభుత్వాన్ని నడిపిస్తున్న రేవంత్ సర్కారుకు చిన్ని చిన్న ఇబ్బందులు.. ఇరుకున పడిన సందర్భాలు ఉన్నప్పటికి.. తాజాగా రెండు అంశాల మీద ఆయన ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుందన్న భావన అంతకంతకూ పెరుగుతోంది. అయితే.. ఈ రెండు అంశాల్ని ముఖ్యమంత్రి రేవంత్ కాకుండా..ఆయన మంత్రివర్గంలోని ముఖ్యమైన నేతలు టేకప్ చేయటం గమనార్హం. ఆసక్తికర అంశం ఏమంటే.. వారం వ్యవధిలోనే ఒకటికి మూడు అంశాలకు సంబంధించి విపక్షం సంధిస్తున్న అస్త్రాలకు సరైన రీతిలో సమాధానాలు చెప్పే పరిస్థితి లేదన్న మాట బలంగా వినిపిస్తోంది గురుకులాల టెండర్లకు సంబంధించి.. అందులో జరిగినట్లుగా బీఆర్ఎస్ అగ్రనేతలు ఆరోపిస్తున్న భారీ స్కాం అంశం రేవంత్ సర్కార్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ అంశంపై బహిరంగ చర్చకు సవాలు విసరటం.. అందుకు స్పందించిన హరీశ్.. తనకు లభించిన అవకాశాన్ని అందిపుచ్చుకొని చర్చకు సిద్ధం కావటం.. ఈ దూకుడును అంచనా వేయటంలో జూపల్లి అండ్ కో ఫెయిల్ కావటంతో.. తదుపరి అడుగు ఎలా వేయాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్న వేళలో జరగాల్సిన డ్యామేజ్ జరిగిపోయింది వంద రోజుల్లో హామీల పూర్తి.. హైడ్రా.. రైతు రుణమాఫీ.. రైతు భరోసా.. ఇలా పలు అంశాలకు సంబంధించి చికాకులు ఎదురైనప్పటికి.. అవేమీ ప్రభుత్వాన్ని అంతగా ఇరుకున పెట్టింది లేదు. అందుకు భిన్నంగా గడిచిన వారంలో తెర మీదకు వచ్చిన గురుకుల పాఠశాలల టెండర్లలో చోటు చేసుకుందని చెబుతున్న భారీ కుంభకోణం.. రాష్ట్ర అప్పుల వివాదం విషయంలో మాత్రం ఆయా మంత్రుల కారణంగా ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినట్లుగా చెబుతున్నారు. రెండున్నరేళ్లలో ఎప్పుడూ లేనంత స్పష్టంగా అధికారపక్షంపైన విపక్షం అధిక్యను ప్రదర్శించినట్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇది గులాబీ దళానికి కొత్త ఊపును ఇస్తే.. రేవంత్ ప్రభుత్వం కొత్త తరహా ఒత్తిడిని ఎదుర్కొంటోంది.అంతా తమ ప్రతిభేనంటూ ఎవరికివారు గొప్పలు చెప్పుకోవటం.. జబ్బలు చరుచుకుకోవటం మామూలే. అదే సమస్య ఎదురైనప్పుడు.. ఇబ్బందులు తలెత్తినప్పుడు వాటిని సరిదిద్ది అధిక్యతను ప్రదర్శించటం అంత తేలికైన విషయం కాదు. గురుకులాలు.. రాష్ట్ర అప్పుల విషయంలో హరీశ్ అండ్ కో లేవనెత్తిన అంశాలకు బలమైన కౌంటర్ ఇచ్చే విషయంలో మంత్రులు నీళ్లు నములుతూ.. బిక్కముఖాలు వేసిన వేళ.. సీఎం రేవంత్ అవసరం ఎంతన్న విషయం కాంగ్రెస్ వర్గాలకు అర్థమైనట్లుగా చెబుతున్నారునెట్టింట హల్‌చల్ ఇప్పటివరకు సింగిల్ హ్యాండ్ తో కేసీఆర్.. కేటీఆర్.. హరీశ్ లకు కౌంటర్లు ఇస్తుంటే.. సీఎం విలువ

కాంగ్రెస్ మంత్రులకు అర్థం కాలేదని.. తాజా పరిణామాలతో విషయం అందరికి అవగతమవుతోందన్న మాట వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో చేజారిన అధిక్యతను తిరిగి నిలబెట్టుకోవటానికి ఈ రెండు అంశాలను సీఎం రేవంత్ టేకప్ చేయనున్నట్లుగా చెబుతున్నారు. ఒకవేళ.. అనుకున్నట్లే.. ఈ రెండు అంశాల్ని టేకప్ చేసి.. విపక్షాన్ని తన వాదనతో ఉతికి ఆరేస్తే మాత్రం.. రేవంత్ సత్తా మరోసారి నిరూపితమవుతుందన్న మాట వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి.

# ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంప్ యార్డా?




- సిద్దాపూర్ డంప్ యార్డు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి..
- లేనిపక్షంలో బాధిత రైతుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమిస్తుంది.
- మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో డంప్ యార్డు ఏర్పాటు నిర్ణయంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న స్థానిక రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. డంప్ యార్డు వల్ల తాము ఏ విధంగా నష్టపోతున్నామో వివరిస్తూ ఆయన ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పక్షాన పోరాడాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. రైతుల వినతిపై స్పందించిన మాజీ మంత్రి హరీశ్ రావు గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు.

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నం. 641 తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన చర్య.

పచ్చని వ్యవసాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనం. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది.సిద్దాపూర్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాలు ఈ డంప్ యార్డు వల్ల తీవ్రంగా నష్టపోతాయి. ఈ గ్రామాల ప్రజలంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి ఆనుకుని ఉన్న 'గుట్ట చెరువు' నీటితోనే ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు.ఇప్పుడు ఆ చెరువు పక్కనే డంప్ యార్డు పెడితే ఆ నీరు పూర్తిగా కలుషితమై, సాగు నీటితో పాటు తాగునీటికీ తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. అంతేకాకుండా ఎంతో ప్రసిద్ధి చెందిన జహంగీర్ పీర్ దర్గా కూడా ఇక్కడే ఉండటంతో, ఆ కాలుష్యం స్థానికులతో పాటు భక్తులకు కూడా శాపంగా మారడం ఖాయం.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో, డంప్ యార్డుకు కేటాయించిన సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మించాలని మేము ప్రణాళికలు రూపొందించాం. ఇక్కడ ఐటీ పార్క్ వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ సంకల్పించింది.

కానీ, ఉపాధి కల్పించాల్సిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం డంప్ యార్డు ఏర్పాటు చేసి స్థానిక ప్రజల బతుకులను చిదిమేయాలని చూడటం శోచనీయం. యువతకు అవకాశాలు కల్పించాల్సిన చోట కాలుష్యాన్ని, రోగాలను ఇవ్వడమే ప్రజాపాలనా?ప్రభుత్వం డంప్ యార్డులను ఏర్పాటు చేయాలనుకుంటే ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలగని చోట, జనావాసాలు, గ్రామాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. కానీ ఇలా పచ్చని పల్లెలను, పొలాలను, రైతులను ఆగమాగం చేయడం ఏమాత్రం తగదు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిద్దాపూర్ డంప్ యార్డు నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో నష్టపోతున్న ఆ 20 గ్రామాల ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని, స్థానిక రైతులకు అండగా నిలబడి పోరాడుతుందని హెచ్చరిస్తున్నాం.

# ఎవరిది నిజం... తెలంగాణ అప్పుల ఎంత

**హైదరాబాద్, జూలై 6, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల లెక్కలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధం ముదిరింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపిస్తుంటే, మరోవైపు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. అసలు రాష్ట్ర అప్పులు రూ.1.86 లక్షల కోట్లా? లేక రూ.8.21 లక్షల కోట్లా? అనే గందరగోళం ప్రజల్లో నెలకొంది. ఇరు పార్టీలు సాక్ష్యాధారాలు, ఆర్బీఐ లెక్కలను తెరపైకి తెస్తూ తామే కరెక్ట్ అని వాదిస్తున్నాయి.మాజీ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఆర్బీఐ గణాంకాలను, స్వయంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో చేసిన ప్రకటనలను ఉటంకిస్తూ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన వాదన ప్రకారం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు భారీగా అప్పులు చేసింది. మంత్రి జూపల్లి కృష్ణారావు వాట్సాప్ లేఖ ప్రకారం ఈ అప్పు రూ.1,77,058 కోట్లు కాగా, 2026 జూన్ 30 నాటికి ఆర్బీఐ అధికారిక లెక్కల ప్రకారం అది రూ.1,86,067 కోట్లకు చేరింది. వివిధ మార్గాల ద్వారా ఈ ప్రభుత్వం మొత్తంగా రూ.4.5 లక్షల కోట్ల వరకు అప్పులు చేసిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో నేరుగా తీసుకున్న రుణాలు, ప్రభుత్వ గ్యారెంటీతో పొందిన కార్పొరేషన్ రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని అసెంబ్లీ వేదికగా తాము నిరూపించామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. 2026 మార్చి 18న అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఎఫ్ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రాష్ట్ర అప్పులు రూ.3,47,294 కోట్లుగా ప్రకటించారని, మరి ఇప్పుడు డిప్యూటీ సీఎం ఏకంగా రూ.8.21 లక్షల కోట్లు అని ఏ విధంగా చెప్తారని హరీశ్‌రావు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు సందర్భాన్ని బట్టి అబద్ధపు లెక్కలు మారుస్తున్నారని ఆయన విమర్శించారు.మరోవైపు డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బీఆర్ఎస్ ఆరోపణలను పూర్తిగా తిప్పికొట్టారు. గత ప్రభుత్వం అబద్ధాల పునాదులపై నడిచిందని, సోషల్ మీడియా వేదికగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ బ్యాంకులు, సంస్థలు, కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన రుణాలు, చెల్లించాల్సిన బకాయిలు అన్నీ కలిపి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల భారీ భారాన్ని మోపిందని చెప్పారు. గత ప్రభుత్వం దాదాపు 10 శాతం వరకు అధిక వడ్డీకి అడ్డగోలుగా రుణాలు తెచ్చిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక రూ.34 వేల కోట్లుగా ఉన్న వార్షిక వడ్డీ భారాన్ని ప్రణాళికాబద్ధంగా రూ.11 వేల కోట్లకు తగ్గించామని, ఇప్పటికే రూ.2.08 లక్షల కోట్ల పాత అప్పుల బకాయిలను చెల్లించామని వెల్లడించారు.ఇరుపక్షాల వాదనలను పరిశీలిస్తే, లెక్కల వైరుధ్యం ఎక్కడ వస్తోందో స్పష్టమవుతుంది. బీఆర్ఎస్ కేవలం బడ్జెట్ పరిధిలోని అప్పులు, ఎఫ్ఆర్‌బీఎం పరిమితులను మాత్రమే ప్రామాణికంగా చూపిస్తోంది. అందుకే వారి లెక్క రూ.3.47 లక్షల కోట్ల నుంచి రూ.4.17 లక్షల కోట్ల మధ్య ఉంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బడ్జెటేతర రుణాలు, అంటే కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టుల కోసం వివిధ కార్పొరేషన్ల పేరిట తెచ్చిన అప్పులు, సివిల్ సప్లైస్ బకాయిలు, పవర్ డిస్కామ్‌ల నష్టాలు, ఇతర పెండింగ్ బిల్లులన్నింటినీ కలిపి సుమారు రూ.8.21 లక్షల కోట్లుగా లెక్కిస్తోంది.సాంకేతికంగా ఆర్బీఐ నిబంధనల ప్రకారం నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో ఉన్న అప్పుల విషయంలో బీఆర్ఎస్ చూపిస్తున్న రూ.1.86 లక్షల కోట్ల తాజా అప్పుల గణాంకాలు, గత అంచనాలు వాస్తవమే అయినప్పటికీ.. కార్పొరేషన్ల గ్యారెంటీల ద్వారా రాష్ట్రంపై పడిన పరోక్ష అప్పుల భారాన్ని పరిగణనలోకి తీసుకుంటే కాంగ్రెస్ చెబుతున్న రూ.8.21 లక్షల కోట్ల సంఖ్య కూడా వాస్తవ ఆర్థిక భారాన్ని ప్రతిబింబిస్తోంది.

**2014 జూన్ 2న రూ.72,658 కోట్ల అప్పు**

మొదటగా, 2014 జూన్ 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పుడు, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం జనాభా ప్రాతిపదికన తెలంగాణ వాటాగా వచ్చిన ప్రారంభ అప్పు రూ.72,658 కోట్లు. అప్పట్లో తెలంగాణ మిగులు బడ్జెట్ కలిగిన రాష్ట్రంగా పటిష్టమైన ఆర్థిక స్థితితో ప్రస్థానాన్ని ప్రారంభించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేళ్ల పాలన ముగిసి, డిసెంబర్ 2023లో వారు దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పులు ఊహించని స్థాయికి చేరాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అధికారిక శ్వేతపత్రం ప్రకారం.. బడ్జెట్ రుణాలు, ప్రభుత్వ గ్యారెంటీలతో కార్పొరేషన్లు కాళేశ్వరం, పవర్ ఫైనాన్స్ వంటివి తెచ్చిన బడ్జెటేతర రుణాలు అన్నీ కలిపి మొత్తం అప్పు రూ.6,71,757 కోట్లకు చేరింది.ఇక గత రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత అప్పు చేసిందనే దానిపై ఇరు పార్టీల మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. మార్చి 2026 బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే 2026 నివేదిక ప్రకారం.. డిసెంబర్ 2025 నాటికి తెలంగాణ రాష్ట్రం , దాని అనుబంధ సంస్థల మొత్తం అప్పుల భారం రూ.8 లక్షల కోట్లకు చేరింది. అంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్ల కాలంలో రాష్ట్రం , దాని కార్పొరేషన్ల ద్వారా సుమారు రూ.3,19,179 కోట్ల కొత్త రుణాలను సేకరించారు.

**పాత అప్పులు తీర్చామంటున్న కాంగ్రెస్**

ఇక్కడే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ముఖ్యమైన ఆర్థిక పద్దును తెరపైకి తెస్తోంది. తాము తెచ్చిన రూ.3.19 లక్షల కోట్ల రుణాలలో సింహభాగం సొమ్మును పాత అప్పులు తీర్చడానికే ఉపయోగించామని ప్రభుత్వం చెబుతోంది. గడిచిన రెండేళ్లలో పాత అప్పుల

అసలు, వడ్డీల రూపంలో ఏకంగా రూ.3,04,202 కోట్లను తిరిగి చెల్లించినట్లు అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గతంలో తెచ్చిన రూ.44,000 కోట్ల రుణాల క్లియరెన్స్ కూడా ఉంది.తెలంగాణ రాష్ట్రంపై నేడు ఉన్న సర్వసమ్మతమైన, అధికారికమైన మొత్తం అప్పుల భారం రూ.8 లక్షల కోట్లు. రాజకీయ నేతలు కేవలం పబ్లిక్ డెట్ ప్రస్తుతం సుమారు రూ.5.03 లక్షల కోట్లు మాత్రమే చూపిస్తున్నారు. కానీ కార్పొరేషన్ల గ్యారెంటీ అప్పులను కూడా కలిపితేనే అసలైన రూ.8 లక్షల కోట్ల నిజం బయటపడుతుంది. గత ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల కోసం అప్పులు చేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం ఆ పాత అప్పుల రీస్ట్రక్చరింగ్ , వడ్డీలు కట్టడానికే మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి వస్తోందని, ఈ చక్రబంధం నుండి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ తేరుకోవడానికి మరికొన్నేళ్లు పడుతుందని భావిస్తున్నారు.ఎవరు కరెక్ట్ అన్నది వారు ఏ అప్పులను ప్రామాణికంగా తీసుకుంటున్నారనే దానిపైనే ఆధారపడి ఉంది. ఏదేమైనా, ఈ లెక్కల లడాయి తేలాలంటే ఇరుపక్షాలు సవాళ్లకు పరిమితం కాకుండా, ఒకే వేదికపై శ్వేతపత్రాలతో బహిరంగ చర్చకు రావలసి ఉంది.

# అమాత్యా... వదిలేదెలా అంటున్న రాజగోపాల రెడ్డి

**నల్గొండ, జూలై 6 పెన్ పవర్:** రాజకీయాల్లో అలకలు ఉంటాయి. అవి సత్యభామ లాంటి లాంటి అలకలు. తాను అలిగితే పరమాత్ముడు అంతటి శ్రీ క్రిష్ణుడు వచ్చి మరీ బుజ్జగించి అనుకున్నది నెరవేర్చిన ఉదంతం సత్యభామ వ్యవహారం చెబుతుంది. రాజకీయాల్లో కూడా అలకలు కోరికలు తీర్చుకోవడానికే అని అంటారు. ఆ మాటకు వస్తే అలగని నేతలు బహు తక్కువ. ప్రతీ చోటా ప్రతీ ప్రభుత్వంలో ప్రతీ రాజకీయంలోనూ అలకలు పూనిన వారు ఎంతో మంది కనిపిస్తారు. అయితే అందరి అలకలు తీరాలని ఏమీ రూల్ లేదు, అలా అలకలు ఎక్కువగా ఉన్నా విలువ తగ్గి రొటీన్ అయిపోయే సీన్ కూడా ఉంటుంది. ఇక విషయానికి వస్తే తెలంగాణా కాంగ్రెస్ లో సీనియర్ నేత మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అలకలు ఎపుడూ చర్చనీయాంశం అవుతూనే ఉన్నాయి. సినిమాలో రేంజ్ ప్లాన్ వింటే షాకవుతారు ఆనాడే బీజం పడింది : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణాలో వచ్చి రెండున్నరేళ్ళు దాటింది. మంత్రివర్గంలో తనకు సీటు దక్కుతుందని ఎంతగానో భావించిన రాజగోపాల్ రెడ్డి తనకు చాన్స్ ద క్కకపోవడంతోన అలకపానుపు ఎక్కారు. సగం పాలన పూర్తి అయినా ఆయన అలక పానుపు దిగడం లేదు, అదే సమయంలో ఆయన మంత్రి పదవి ముచ్చట కూడా తీరడం లేదు అని అంటున్నారు. దానికి అనేక కారణాలు ఉన్నాయి. ఒకే జిల్లా నుంచి ఇద్దరు ఒకే సామాజిక వర్గం నేతలు మంత్రులుగా ఉన్నారు. ఉత్తం కుమార్ రెడ్డి, అలాగే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఈ ఈక్వేషన్ ఇలా ఉంటే కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా రాజగోపాల్ రెడ్డి అన్న. దాంతో ఒకే కుటుంబంలో మంత్రులుగా ఇద్దరికి చాన్స్ అసలు ఇవ్వరు, ఆ విధంగా చూస్తే రాజగోపాల్ రెడ్డికి అసలైన అడ్డంకి ఇంట్లోనే ఉంది అని అంటున్నారు. కాబట్టి తనకు మంత్రి పదవి దక్కాలి అన్నది రాజగోపాల్ రెడ్డి వాదన. అయితే ఎవరు ఏ హామీ ఇచ్చినా మంత్రివర్గం కూర్పు అంటే అనేక ఈక్వేషన్స్ ఉంటాయి. దాంతో ఎంత దగ్గర వారికి అయినా ఒక్కోసారి చాన్స్ దక్కకపోవచ్చు. సొంత అన్నయ్య వెంకటరెడ్డి త్యాగం చేస్తే తప్పకుండా రాజగోపాల్ రెడ్డి కోరిక తీరుతుంది, మరి అది జరుగుతుందా అన్నదే మరో ప్రశ్న. ఇదిలా ఉంటే సమయం వచ్చినపుడల్లా తన అసలైన అలకకు కొత్త విషయాలు జోడించి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల మీద విమర్శలు చేస్తున్నారు రాజగోపాల్ రెడ్డి, లేటెస్ట్ గా చూస్తే ఆయన ఒక విషయం మీద అలిగారు, ఆగ్రహించారు. తమ జిల్లా పరిధిలోకి వచ్చే యాదాద్రి ట్రస్ట్ బోర్డు నియామకం విషయంలో కనీస మాత్రంగా స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించకపోవడమేంటి అని గుస్సా అయ్యారు. ఇలా అయితే మేము ఎందుకు అని కూడా లాజిక్ పాయింట్ తీశారు.యాదాద్రి ట్రస్ట్ బోర్డు మీద మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి పాత వారు కాంగ్రెస్ లో ఉంటే వారికి విలువ ఇవ్వడం లేదని ఆక్షేపించారు. అదే సమయంలో కొత్త వారికే ప్రాధాన్యత ఇస్తున్నారు అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో ఒరిజినల్ లీడర్లు అన్న మాట కూడా వాడారు, వారికి న్యాయం జరగడం లేదని కూడా అన్నారు. ఇలా అయితే తమలాంటి వారికి పార్టీలో కొనసాగడం కష్టతరం అవుతుందని కూడా రాజగోపాల్ రెడ్డి క్లారిటీగా మాట్లాడేశారు. అయితే కోమటిరెడ్డి అలక అన్నది ఇపుడు రొటీన్ గా పార్టీ పెద్దలు కానీ ప్రభుత్వం పెద్దలు కానీ తీసుకుంటున్నారా అన్న చర్చ సాగుతోంది. ఆయన సొంత పార్టీలో విపక్ష నేతగా చేస్తున్న కామెంట్స్ ని లైట్ తీసుకుంటున్నారా ఆయన వేదన అంతా అరణ్య రోదన అవుతోందా అంటే ఏమో మరి అని అంటున్నారు.

# కోటి దాటేస్తున్న హైదరాబాద్ జనాభా



**హైదరాబాద్, జూలై 5, పెన్ పవర్:** ఉమ్మడి ఏపీలో జనాభా రమారమి ఎనిమిదిన్నర కోట్ల దాకా ఉన్నపుడు 2014లో రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాయి. అందులో ఏపీ జనాభా దాదాపుగా అయిదు కోట్లు ఉంటే తెలంగాణా జనాభా మూడున్నర కోట్లు అని అంచనాలు ఉండేవి. అయితే విభజన తరువాత పుష్కర కాలం గడిచిపోయింది. ఈ క్రమంలో ఇన్నేళ్ళ కాలంలో తెలంగాణా జనాభాలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పెద్ద ఎత్తున జనాభా పెరిగినట్లుగా తాజా అంచనాలు తెలియచేస్తున్నాయి. ఏకంగా మరో కోటి దాకా జనాభా తెలంగాణాలో కొత్తగా జత చేరుతోందని ప్రాధమిక లెక్కలు తెలియచేస్తున్నాయి. దీంతో తెలంగాణా వేగంగా ఎదుగుతూ తన వైపుగా జనాలను ఆకట్టుకుంటున్న మోస్ట్ పాపులర్ స్టేట్ గా ఎమర్జ్ అవుతోంది అని అంటున్నారు. ఇదిలా ఉంటే జనగణన కేంద్రం ఆదేశాల మేరకు దేశమంతటా జరుగుతోంది. అందులో తొలిదశలో కుటుంబాల విషయం సర్వేగా తీసుకుంటే ఒక లెక్క అయితే బయటకు వస్తోంది. తెలంగాణా రాష్ట్రంలో ప్రస్తుతం అయితే కోటీ పద్నాలుగు లక్షల మంది దాకా కుటుంబాలు నివసిస్తున్నాయని అంటున్నారు. అధికారికంగా దీని మీద అయితే ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. అదే సమయంలో ఇప్పటికి రెండు సర్వేలు అయితే తెలంగాణాలో జరిగాయి. అందులో ఒకటి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలలో చూస్తే కుటుంబాలు తెలంగాణాలో అధికం అయినట్లుగా తెలుస్తోంది. అంతే కాదు దీని ప్రకారం చూస్తే జనాభా కూడా భారీగానే పెరిగింది అని అంటున్నారు. ఇక తెలంగాణా రాజధాని హైదరాబాద్ గోవా వంటి రాష్ట్రంలోని కుటుంబాల కంటే ఎక్కువగా కలిగి ఉందని ప్రాధమిక సమాచారం చెబుతోంది. దీనికి సంబంధించి మే నెలలో 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకూ నిర్వహించిన తొలి దశ కుటుంబ సర్వేలో అధికారులు ఇంటింటికీ వెళ్లి కుటుంబాలు, భవనాలు, ఇళ్లు, ఇతర నిర్మాణాల వివరాలను పక్కాగా నమోదు చేశారు. ఈ లెక్కలను తీసుకుంటే కనుక హైదరాబాద్ లో మొత్తం 36 లక్షల మంది దాకా కుటుంబాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇది గోవా కంటే ఎక్కువ అని అంటున్నారు. ఇక జనగణన కూడా కేంద్ర ప్రభుత్వం చేస్తోంది. కుటుంబాలు ప్రస్తుతం తొలి దశలో లెక్కగా తేలుతున్నాయి. ఇక రెండవ దశలో వ్యక్తిగత గణన ఉంది. ఆ వివరాలు 2027 ఫిబ్రవరి నుంచి నమోదు చేస్తారు. ఆ వివరాలు కనుక వస్తే మాత్రం తెలంగాణా జనాభా మొత్తం కచ్చితంగా వస్తుందని అంటున్నారు. ఇక్పుటికే తాజాగా కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలకు వ్యకిగత గణన కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. కుటుంబాలే తెలంగాణాలో కోటీ 14 లక్షలకు పైగా ఉంటే జనాభా ఎంత అన్న చర్చ మొదలైంది. ఒక్కో కుటుంబంలో కనీసంగా నలుగురు వేసుకున్నా ఈజీగా నాలుగున్నర కోట్ల మంది తెలంగాణా జనాభా ఉంటుందని అంటున్నారు. ఇదిలా ఉంటే తెలంగాణాలో రాష్ట్ర ప్రభుత్వం ఆరేడు నెలల క్రితం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. అందులో వచ్చిన లెక్క చూస్తే జనాభా మూడు కోట్ల 70 లక్షల దాకా ఉండొచ్చు అని లెక్క తేలింది. అయితే ఈ సర్వేలో మూడు నుంచి నాలుగు శాతం మంది జనాలు పాల్గొనలేదని అంటున్నారు. దాంతో ఈసారి కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జన గణనలో మొత్తం పాల్గొంటారు కాబట్టి కచ్చితంగా ఆ లెక్క చూస్తే నాలుగున్నర కోట్ల పైచిలుకు గా తెలంగాణా జనాభా ఉండొచ్చు అని అంటున్నారు.ఇక ఇప్పటికి పదహారేళ్ళ క్రితం 2010లో ఉమ్మడి ఏపీలో నిర్వహించిన జనాభా లెక్కలు చూస్తే తెలంగాణా జనాభా మూడున్నర కోట్లుగా తెలింది. అలాగే కుటుంబాలు అయితే 83 లక్షలుగా ఆనాడు పేర్కొన్నారు. గడచిన కాలంలో కుటుంబాలు కోటీ 14 లక్షలకు చేరుకున్నాయి అంటే 31 లక్షల దాకా పెరిగింది అని వివరాలు చెబుతున్నాయి. ఇక జనాభా కూడా కచ్చితంగా కోటికి పైగా పెరగవచ్చు అని అంటున్నారు. జనాభా ఎంత అన్నది వచ్చే ఏడాది ప్రధామార్ధంలో కచ్చితమైన లెక్క తేలుతుందని అంటున్నారు.

# రియాల్టీ రంగంలో కొత్త స్టార్ అలియాబాద్!

**హైదరాబాద్, జూలై 6, పెన్ పవర్:** సికింద్రాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారి కి ఆనుకుని ఉన్న శామీర్‌పేట సమీప అలియాబాద్ ప్రాంతం ఉత్తర హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్‌లో సరికొత్త హాట్‌స్పాట్‌గా అవతరిస్తోంది. గతంలో కేవలం ప్రసిద్ధ రత్నాలయ శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా మాత్రమే సుపరిచితమైన ఈ ప్రాంతం.. ఇప్పుడు వేగంగా పారిశ్రామిక, నివాస హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ఇటీవల కాలంలో ఇక్కడ ఇంటర్నేషనల్ స్కూళ్లు, భారీ కమర్షియల్ కాంప్లెక్స్‌లు , గేటెడ్ కమ్యూనిటీ విల్లా ప్రాజెక్టులు వెలుస్తుండటంతో, రాబోయే రోజుల్లో ఇది పశ్చిమ హైదరాబాద్‌లోని మియాపూర్ రేంజ్ కమర్షియల్ వృద్ధిని నమోదు చేయబోతోందని మార్కెట్ వర్గాల తాజా కథనాలు స్పష్టం చేస్తున్నాయి.అలియాబాద్ ప్రాంతానికి ఈ స్థాయి డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణం దాని అద్భుతమైన కనెక్టివిటీ, వ్యూహాత్మక లొకేషన్. శామీర్‌పేట జీనోమ్ వ్యాలీ బయోటెక్ హబ్‌కు ఇది అత్యంత సమీపంలో ఉండటం, ఐటీ రంగానికి ప్రత్యామ్నాయంగా ఇక్కడ ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీలు విస్తరిస్తుండటంతో నివాస గృహాలకు గిరాకీ ఒక్కసారిగా పెరిగింది. దీనికి తోడు ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్-7 కు కొద్ది నిమిషాల దూరంలోనే ఉండటంతో.. అటు ఘటకేసర్, ఉప్పల్ వైపు, ఇటు మేడ్చల్, గచ్చిబౌలి కారిడార్లకు ప్రయాణం సులభతరమైంది. ఈ భౌగోళిక సానుకూలతలే అలియాబాద్‌ను సామాన్య ఇన్వెస్టర్లకే కాకుండా మెగా డెవలపర్లకు కూడా ఫేవరెట్ జోన్‌గా మార్చాయి.మరోవైపు, ఈ రీజియన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించింది. రాజీవ్ రహదారిని మరింత ఆధునీకరించడం, రీజినల్ రింగ్ రోడ్ కనెక్టివిటీ ప్రతిపాదనలు ఈ ప్రాంత స్థిరాస్తి విలువకు మరింత రెక్కలు తొడిగాయి. ఒకప్పుడు కేవలం వీకెండ్ రిసార్టులకు, ఫామ్‌హౌస్‌లకు మాత్రమే పరిమితమైన శామీర్‌పేట-అలియాబాద్ బెల్ట్.. ఇవాళ కార్పొరేట్ హాస్పిటళ్లు, విద్యాసంస్థలు, వినోద కేంద్రాల ఏర్పాటుతో పూర్తిస్థాయి శాశ్వత నివాస యోగ్యమైన అర్బన్ టౌన్‌షిప్‌గా మారుతోంది.ప్రస్తుతం పశ్చిమ హైదరాబాద్‌లో ప్లాట్లు లేదా ఫ్లాట్ల ధరలు మధ్యతరగతి శ్రేణికి అందుబాటులో లేకుండా పోవడంతో, చాలామంది ఉద్యోగులు ఉత్తర కారిడార్‌లోని అలియాబాద్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ ఇంకా ధరలు రీజనబుల్ రేంజ్‌లోనే ఉండటం, భవిష్యత్తులో స్థిరమైన క్యాపిటల్ అప్రిసియేషన్ గ్యారెంటీగా ఉంటుందనే నమ్మకం ఉండటంతో ఓపెన్ ప్లాట్లకు, గేటెడ్ కమ్యూనిటీ ఫ్లాట్లకు విపరీతమైన బుకింగ్స్ జరుగుతున్నాయి.

**సిటీలోనూ ఫుల్ డిమాండ్**

ఐటీ కారిడార్‌లో ఐటి ప్రాజెక్టుల మందగమనం, మిగిలిపోయిన స్టాక్ అంటూ సాగుతున్న ఈ ప్రచారంపై క్రెడాయ్, నారెడ్కో లెక్కలు భిన్నమైన నిజాన్ని చెబుతున్నాయి. నెట్‌లో సర్క్యులేట్ అవుతున్న ఈ గణాంకాలు క్షేత్రస్థాయి వాస్తవాలకు చాలా దూరంగా ఉన్నాయని, కేవలం సంచలనం కోసమే ఇలాంటి తప్పుడు నెరేటివ్స్ బిల్డ్ చేస్తున్నారు హైదరాబాద్ మార్కెట్‌లో లాంచ్ అవుతున్న హై-రైజ్ ప్రాజెక్టులు, గేటెడ్ కమ్యూనిటీ టౌన్‌షిప్‌లు పూర్తిగా నిర్మాణ దశ పూర్తి చేసుకుని వినియోగంలోకి రావడానికి కనీసం 3 నుండి 5 ఏళ్ల సుదీర్ఘ సమయం పడుతుంది. బిల్డర్లు రేరా నిబంధనల ప్రకారం దశలవారీగా నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తుంటారు. ఈ క్రమంలో ప్రాజెక్ట్ ప్రారంభంలో లేదా నిర్మాణంలో ఉన్న ప్రతి ఫ్లాట్‌ను అమ్ముడుపోని ఖాళీ ఫ్లాట్ గా లెక్కగట్టడం ఏమాత్రం సరైనది కాదు. అవి భవిష్యత్తు అవసరాల కోసం పైప్‌లైన్‌లో ఉన్న సప్లై కిందకు వస్తాయే తప్ప, సిద్ధంగా ఉండి ఎవరూ కొనని ఇళ్లు కావు.

మార్కెట్ పతనం అవుతోందంటూ సాగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, మార్కెట్ ఇప్పటికీ అత్యంత స్థిరంగా , పటిష్టంగానే ఉందని డెవలపర్లు పేర్కొంటున్నారు. గత కొన్ని ఏళ్లుగా దేశంలోని ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ అద్భుతమైన వృద్ధి రేటును నమోదు చేస్తూ వస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న వ్యాపారం మరియు రిజిస్ట్రేషన్ల వేగం కేవలం హెల్తీ మార్కెట్ కరెక్షన్‌ను మాత్రమే సూచిస్తోందని, కొనుగోలుదారులు ఎవరూ ఇలాంటి ఊహాగానాలకు లోనై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు.నగరాభివృద్ధికి అనుగుణంగా ప్రభుత్వం మౌలిక సదుపాయాలను వేగంగా విస్తరిస్తుండటం, శాంతిభద్రతలు, ఐటీ , కమర్షియల్ స్పేస్ పరంగా వస్తున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లు హైదరాబాద్ రియాల్టీకి ఎల్లప్పుడూ రక్షణ కవచాలుగా నిలుస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. సోషల్ మీడియాలో వచ్చే నిరాధారమైన రిపోర్టులను నమ్మి నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాజెక్టుల రేరా అప్రూవల్స్, బిల్డర్ల ట్రాక్ రికార్డును పరిశీలించి కొనుగోళ్లు చేసుకోవడమే ఉత్తమం.

# కాళేశ్వరం చుట్టూ రాజకీయాలు

**కరీంనగర్, జూలై 6 పెన్ పవర్:** తెలంగాణలో వర్షాకాలం ప్రారంభమై గోదావరి నదిలోకి వరద నీరు వచ్చి చేరుతున్న తరుణంలో.. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చుట్టూ మళ్లీ రాజకీయం వేడెక్కింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లను తక్షణమే ఆన్ చేసి, ఎగువన ఉన్న రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ.. భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన బృందంతో కలిసి మేడిగడ్డ పర్యటనకు సిద్ధమయ్యారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతాంగానికి నీరందించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఈ టూర్‌ను ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేసింది.గోదావరిలోకి భారీగా ఇన్-ఫ్లో వస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ పై ఉన్న రాజకీయ కక్షతోనే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేయడం లేదని కేటీఆర్ మండిపడుతున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లు సురక్షితంగా ఉన్నాయని, వాటిని ఆన్ చేసి నీటిని పంప్ చేస్తే ఎండిపోతున్న ఆయకట్టుకు ప్రాణం పోయవచ్చని బీఆర్ఎస్ వాదిస్తోంది. కేసీఆర్ నిర్మించిన మహా అద్భుత ప్రాజెక్టును పనికిరానిదిగా చిత్రీకరించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని, దీనిని ఎండగట్టడానికే తాము క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తున్నట్లు కేటీఆర్ వర్గం స్పష్టం చేసింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఈ డిమాండ్‌ను పూర్తిగా తోసిపుచ్చింది. మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పిల్లర్ల వల్ల ప్రస్తుతం అక్కడ నీటిని నిల్వ ఉంచడం ప్రమాదకరమని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిబంధనల ప్రకారం జూన్ 2027 నాటికి మాత్రమే పునరుద్ధరణ పనులు పూర్తవుతాయని స్పష్టం చేస్తోంది. కేటీఆర్ వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యంగా, కనీస కామన్ సెన్స్ లేకుండా ఉన్నాయని కొట్టిపారేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పుడు డిజైన్ల వల్లే



మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ప్రస్తుతం సెంట్రల్ వాటర్ కమిషన్ , ఎన్‌డీఎస్ఏ నిపుణుల ఆధ్వర్యంలో 13 రకాల కీలక సేఫ్టీ టెస్టులు నడుస్తున్నాయి. ఇలాంటి సాంకేతిక పరీక్షల సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా మోటార్లు ఆన్ చేసి నీటిని నిల్వ చేస్తే.. దిగువన ఉన్న భద్రాచలంతో పాటు 44 గ్రామాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి రాజకీయం చేయాలని చూస్తే సహించేది లేదు" అని మంత్రి హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టు మళ్లీ ఉభయ పార్టీల మధ్య ఈ శ్రావణ మాసంలో పొలిటికల్ వార్‌కు కేంద్రీకృతంగా మారింది. బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకోవడానికి, కేసీఆర్ మార్క్ ప్రాజెక్టును

డిఫెండ్ చేసుకోవడానికి చలో మేడిగడ్డ అస్త్రాన్ని ప్రయోగిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం టెక్నికల్ సేఫ్టీ రిపోర్టులను ముందుకు తెచ్చి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిని, నిర్మాణ లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. రాబోయే రోజుల్లో కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటారా లేదా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు ఎలా హ్యాండిల్ చేస్తారనేది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# వైసీపీ డ్యామేజ్ కంట్రోల్ ఎలా

**ఒంగోలు, జూలై 6 పెన్ పవర్:** ఇటీవల జరుగుతున్న పరిణామాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందికరంగా మారుతున్నాయి. మతపరంగా, కులపరంగా కొందరు చేస్తున్న వ్యాఖ్యలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మెడకు చుట్టుకుంటున్నాయి. కొన్ని వర్గాలను ఆ పార్టీకి దూరం చేస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా ఒక మీడియా ఉంది. సోషల్ మీడియా సైన్యం ఉంది. ఇటీవల మతపరంగా, కుల పరంగా కొందరు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. అటువంటి వ్యక్తులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సాయం అందిస్తుంది అన్నది ఒక ప్రధాన ఆరోపణ. ఆపై ఆ సెక్షన్ మీడియాలో సైతం ఆ వ్యక్తులకు ఎనలేని ప్రాధాన్యం లభిస్తుంది. అయితే ఇక్కడే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్డంగా బుక్ అవుతుంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై హిందూ వ్యతిరేక ముద్ర ఉంది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే హిందుత్వవాదం పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారు ఉన్నారు. అటువంటి వారిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదరిస్తోంది, ప్రోత్సహిస్తోంది అనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో హిందూ వ్యతిరేక ముద్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విపరీతంగా పెరిగిపోతోంది. కుల పరంగా కూడా చేస్తున్న ఆరోపణలు వికటిస్తున్నాయి. ముఖ్యంగా కాపుల విషయంలో ఆ పార్టీ అతిగా స్పందిస్తోంది. పైగా పవన్ కళ్యాణ్ ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు కొందరు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు కాపులు.. ఆ సామాజిక వర్గానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దగ్గర ఈ క్రమంలో చేస్తున్న ప్రయత్నాలు మాత్రం వికటిస్తున్నాయిరాష్ట్రంలో వరుసగా జరుగుతున్న పరిణామాల క్రమం వెనుక శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలన్న కుట్ర దాగి ఉంది. అయితే ఒక ప్రభుత్వం పై బురద జల్లాలన్నా.. వ్యతిరేకత పెంచాలన్న.. దాని వెనుక కచ్చితంగా ప్రధాన ప్రతిపక్షం పాత్ర ఉంటుంది. ఇటీవల వరుస ఘటనలు జరగడం.. అవి ఉద్దేశ పూర్వకంగా చేసే కుట్రల్లా ఉండడంతో ఇందులో వైసీపీ పాత్ర ఉందనేది ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత పక్కకు వెళ్లిపోగా.. ప్రభుత్వ పాలనను అడ్డగించే క్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై వ్యతిరేకత బలంగా పెరుగుతోంది. ఈ మొత్తం పరిణామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్నర్ అవుతోంది.

# మెట్రో ముందుకు సాగనివ్వండి..

**హైదరాబాద్, జూలై 6 పెన్ పవర్:** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–×× విస్తరణ పనులకు అవసరమైన అనుమతులు మంజూరు చేయడంతో పాటు, మెట్రో ఫేజ్–×ను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు–గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ రెడ్డి విడివిడిగా లేఖలు రాసి పంపారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో తీసుకున్న కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.గత సమావేశాల నిర్ణయాల ప్రకారం.. మెట్రో ఫేజ్–× ఆస్తుల విలువను నిర్ధారించడం, అధిక వడ్డీ రుణాల పునర్వ్యవస్థీకరణ బాధ్యతలతో పాటు, హైదరాబాద్ మెట్రో ఫేజ్–×× విస్తరణకు అవసరమైన దీర్ఘకాలిక ఆర్థిక వనరుల సమీకరణపై సమగ్ర అధ్యయనం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఎస్‌బీఐ క్యాప్స్ ను నియమించాలని ఉమ్మడిగా అంగీకరించారు. అయితే, ఈ విషయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ను ఖరారు చేయకపోవడం, ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారికంగా బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరగడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ జాప్యం వల్ల హైదరాబాద్ మెట్రో ఫేజ్–× నిర్వహణలో రోజువారీ ఇబ్బందులు, అనిశ్చితి ఎదురవుతున్నాయని, అలాగే ఫేజ్–×× డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియలు ఆలస్యమవుతున్నాయని తన లేఖల్లో రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఫలితంగా ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్–×× విస్తరణ పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం కాకూడదని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి, ఈ విషయంలో ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, మనోహర్‌లాల్ ఖట్టర్‌లు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కోరారు.జూన్ నెలలో 23న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, ఫేజ్–2 విస్తరణపై కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో దాదాపు 45 నిమిషాల పాటు కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెట్రో ఫేజ్–1 ఆస్తుల విలువ నిర్ధారణ (వాల్యుయేషన్), స్వాధీనానికి అవసరమైన లోన్ సేకరణ, రుణ సంస్థ ఎంపికతో పాటు, ఫేజ్–2 విస్తరణకు అయ్యే నిర్మాణ వ్యయం, దీర్ఘకాలిక రుణాల సేకరణపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఒక ప్రత్యేక కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడిగా ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ నిర్ణయంతో మెట్రో విస్తరణ, స్వాధీన ప్రక్రియలకు ఉన్న ఆటంకాలు తొలిగిపోయాయి.

# అమెరికాలో 85 వేలు.. ఇండియాలో రూ. 30

**న్యూఢిల్లీ, జూలై 6 పెన్ పవర్:**
అమెరికాకు చెందిన లిజ్ అనే మహిళ భారత వైద్య రంగానికి సంబంధించిన ఒక నగ్నసత్యాన్ని ప్రపంచం ముందు ఉంచింది. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన అత్తగారి కోసం అమెరికాలో ఒక్కో టాబ్లెట్‌కు ఏకంగా 85,000 అంటే సుమారు 1,000 డాలర్లు ఖర్చు చేయాల్సి వచ్చేదని.. అదే మందుకు సంబంధించిన జనరిక్ వెర్షన్లు భారతదేశంలో కేవలం 35 నుండి 300 లకే లభిస్తుండటం చూసి ఆమె ఆశ్చర్యానికి లోనైంది. అమెరికాలో మమ్మల్ని నిలువునా దోచుకుంటున్నారు.. కానీ భారతదేశం మాత్రం తన ప్రజలకు అత్యంత చౌకగా, అందుబాటు ధరల్లో ప్రాణదాతగా నిలుస్తోంది అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి.లిజ్ చెప్పిన ఈ మాటలు అక్షరాలా నిజం. భారతదేశాన్ని ప్రపంచానికి ఫార్మసీ రాజధాని అని పిలుస్తారు. అమెరికా వంటి పాశ్చాత్య దేశాలలో పెద్ద పెద్ద ఫార్మా కంపెనీలు తాము కనిపెట్టిన మందులపై దశాబ్దాల పాటు పేటెంట్ హక్కులను కలిగి ఉండి, వాటిని ఇష్టానుసారంగా ఖరీదైన ధరలకు విక్రయిస్తాయి. కానీ భారతదేశంలో ఉన్న పటిష్టమైన చట్టాలు, పేటెంట్ నిబంధనల సవరణల వల్ల.. అదే ఫార్ములాతో సమానమైన నాణ్యత, సామర్థ్యం కలిగిన జనరిక్ మందులను స్థానిక కంపెనీలు అతి తక్కువ ధరకే తయారు చేయడానికి వీలవుతుంది. దీనివల్ల క్యాన్సర్, కిడ్నీ, గుండె జబ్బుల వంటి ప్రాణాంతక వ్యాధుల మందులు కూడా సామాన్యుడికి అందుబాటులోకి వస్తున్నాయి. అమెరికా, బ్రిటన్ , కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాలలో కేవలం ఒక సాధారణ డాక్టర్ అపాయింట్‌మెంట్ లేదా స్పెషలిస్ట్ కన్సల్టేషన్ కోసం వారాలు, కొన్నిసార్లు నెలల తరబడి వేచి చూడాల్సి వస్తుంది . కానీ ఇండియాలో ఆ పరిస్థితి లేదు. పాశ్చాత్య దేశాలలో ప్రభుత్వ లేదా ఇన్సూరెన్స్ పరిధిలోని హెల్త్‌కేర్ సిస్టమ్స్ పై విపరీతమైన ఒత్తిడి ఉండటం వల్ల, అత్యవసరమైతే తప్ప సాధారణ తనిఖీలకు అపాయింట్‌మెంట్లు దొరకడం గగనంగా మారుతుంది. దీనికి భిన్నంగా భారతదేశంలో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ క్లినిక్‌లు, మల్టీ–స్పెషాలిటీ హాస్పిటళ్లు అసంఖ్యాకంగా అందుబాటులో ఉన్నాయి. ఒక రోగి ఉదయం అనుకుంటే.. మధ్యాహ్నానికల్లా దేశంలోనే అత్యుత్తమ వైద్యుడిని నేరుగా కలిసి కన్సల్టేషన్ తీసుకునే వెసులుబాటు, తక్షణ ల్యాబ్ టెస్టుల సౌకర్యం ఇక్కడ ఉంది. ఇదే కారణం వల్ల ప్రస్తుతం భారతదేశం ప్రపంచవ్యాప్తంగా మెడికల్ టూరిజం కు అతిపెద్ద హబ్‌గా అవతరించింది. అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాల నుండి వేలాది మంది విదేశీయులు కేవలం బైపాస్ సర్జరీలు, మోకాళ్ల మార్పిడి, క్యాన్సర్ చికిత్సల కోసం ఇండియాకు వస్తున్నారు. ఎందుకంటే వారి స్వదేశాల్లో ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ అయ్యే ఖర్చుతో పోలిస్తే.. ఇండియాలో ప్రయాణ ఖర్చులు, లగ్జరీ హాస్పిటల్ స్టే, టాప్ సర్జన్ల ఫీజులు అన్నీ కలిపినా 70 నుండి 80 శాతం తక్కువ ధరకే అంతర్జాతీయ స్థాయి వైద్యం అందుతోంది. లిజ్ ఉదంతం మన దేశీయ వైద్య ఆరోగ్య వ్యవస్థ యొక్క గొప్పతనాన్ని, సామాన్యుడికి అది కల్పిస్తున్న భద్రతను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.

# నాలా కన్వర్షన్ కోసం రూ.70 వేల లంచం..ఏసీబీకి చిక్కిన చేర్యాల తహశీల్దార్





**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా చేర్యాల తహశీల్దార్ కార్యాలయంలో అవినీతి తిమింగలం ఏసీబీ వలకు చిక్కింది. లంచం తీసుకుంటూ చేర్యాల తహశీల్దార్ దిలీప్ నాయక్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.ఒక రైతు తన భూమికి సంబంధించిన నాలా కన్వర్షన్ కోసం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాడు. అయితే, ఆ పని చేసి పెట్టడానికి తహశీల్దార్ దిలీప్ నాయక్ సదరు రైతును 70 వేల రూపాయలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆ రైతు... అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు.ఈ క్రమంలో ఈరోజు రైతు నుంచి తహశీల్దార్ దిలీప్ నాయక్ 70 వేల రూపాయల నగదు తీసుకుంటుండగా... ముందస్తు ప్లాన్ ప్రకారం ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. లంచం డబ్బులతో తహశీల్దార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కేటీఆర్... ఇంత మాట అనేశారేంటబ్బా!



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ ఎస్ కీలక నాయకుడు, మాజీ మంత్రి కేటీఆర్.. తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రైతులకు నీళ్లు ఇవ్వడం ప్రస్తుత ప్రభుత్వానికి సాధ్యం కావడం లేదని, రాజకీయ కారణాలతో దీనిని తొక్కిపెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డికి ఈ ప్రాజెక్టును నిర్వహించడం చేతకాకపోతే.. మాజీ సీఎం కేసీఆర్‌కు ఈ ప్రాజెక్టు బాధ్యతలు అప్పగించాలని.. ఆయన వారం రోజుల్లోనే రైతులకు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఇప్పిస్తారని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే బహుళార్థసాధక ప్రాజెక్టుగా ఉన్న కాళేశ్వరంపై విమర్శలు చేస్తోందని కేటీఆర్ అన్నారు. రైతులకు కీలక సమయంలో నీరు ఇవ్వకుండా బీఆర్ ఎస్‌పై ఉన్న రాజకీయ కక్షలతో అన్నదాతలను ఏడిపిస్తోందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేంద్రం కూడా మెచ్చుకున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కన్నేపల్లి వద్ద నిర్మించిన పంప్ హౌస్‌ను వదిలినా లక్షల ఎకరాలకు నీరు చేరుతుందని చెప్పారు. కానీ, సర్కారు మాత్రం మౌనంగా కూర్చుందన్నారు. ప్రస్తుతం వందల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని కేటీఆర్ ఆరోపించారు. దీనిని కావాలనే చేస్తున్నారని.. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఒక్క చర్య కూడా చేపట్టడం లేదని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు కట్టడం చేతకాదు.. ఉన్నవాటిని నిర్వహించడం కూడా చేతకాదని కేటీఆర్ ఆరోపించారు. --కేసీఆర్ రంగంలోకి దిగితే పంపులన్నీ ఆన్ చేసి, అన్ని జలాశయాలను నీటితో నింపి, రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి నీళ్లు అందించి చూపిస్తారు-- అని కేటీఆర్ సవాల్ రువ్వారు. జలాశయాలను పరిశీలించేందుకు వెళ్తున్న బీఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటూ.. ఆయన నిలదీశారు. ఉన్నతాధికారులు చెప్పారని.. పోలీసులు తమను నిలువరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇది సరైన చర్యకాదని ఆయన వ్యాఖ్యానించారు. --మీకు చేతనైతే అన్నదాతలకు నీళ్లు ఇవ్వడం. లేక పోతే ఆ బాధ్యత మాకు అప్పగించండి.-- అని కేటీఆర్ అన్నారు.

# రకింగ్ కొత్త వ్యాయమం

**హైదరాబాద్, జూలై 6 పెన్ పవర్:**
ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిరోజూ వాకింగ్ చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అయితే ఇటీవల ఫిట్‌నెస్ ప్రపంచంలో 'రకింగ్ ' అనే కొత్త వ్యాయామ విధానం ట్రెండ్ అవుతోంది. సైనికులు ఎన్నో ఏళ్లుగా అనుసరిస్తున్న ఈ పద్ధతి ఇప్పుడు సాధారణ ప్రజల్లోనూ ప్రాచుర్యం పొందుతోంది. ఈ పద్ధతి పాటించడం వల్ల సాధారణ వాకింగ్ కంటే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని ఫిట్‌నెస్ నిపుణులు చెబుతున్నారు. అసలేంటీ రకింగ్? దీనిని ఎలా చేయాలి?రకింగ్ అనేది వీపుపై బరువున్న బ్యాక్‌ప్యాక్ ధరించి నడిచే వ్యాయామం. ఇందులో శరీర సామర్థ్యానికి తగ్గట్టుగా బ్యాగ్‌లో బరువు పెట్టుకుని నిర్ణీత దూరం లేదా సమయం పాటు నడుస్తారు. ఇది కార్డియో వ్యాయామంతో పాటు కండరాలపై కూడా ప్రభావం చూపే ఫుల్ బాడీ వర్కౌట్‌గా పరిగణిస్తారు. సాధారణ వాకింగ్‌లో శరీర బరువును మాత్రమే మోస్తూ నడుస్తాం. కానీ రకింగ్‌లో అదనపు బరువును మోయాల్సి ఉండటంతో కాళ్లు, నడుము, వీపు, భుజాలు, పొత్తికడుపు కండరాలు మరింతగా పనిచేస్తాయి. దీనివల్ల శరీరం ఎక్కువ శక్తిని వినియోగించి ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేస్తుంది. అందుకే తక్కువ సమయంలోనే మంచి ఫిట్‌నెస్ ఫలితాలు కనిపించే అవకాశం ఉంటుంది.రకింగ్ వల్ల గుండె వేగం క్రమంగా పెరిగి రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీని వల్ల గుండె కండరాలు బలపడటంతో పాటు హృదయ సంబంధిత సమస్యల ప్రమాదం తగ్గే అవకాశం ఉంటుంది. ఊపిరితిత్తుల పనితీరు కూడా మెరుగుపడి శరీరంలో ఆక్సిజన్ సరఫరా సమర్థవంతంగా జరుగుతుంది.బరువు తగ్గాలనుకునే వారికి రకింగ్ మంచి ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు. అదనపు బరువును మోస్తూ నడవడం వల్ల సాధారణ వాకింగ్‌తో పోలిస్తే ఎక్కువ క్యాలరీలు ఖర్చవుతాయి. దీంతో కొవ్వు కరుగుదల వేగవంతమై బరువు తగ్గే ప్రక్రియకు సహాయపడుతుంది. అదే సమయంలో కండరాల బలం కూడా పెరగడం దీని మరో ప్రత్యేకత.మొదటిసారి రకింగ్ చేసే వారు భారీ బరువుతో ప్రారంభించకూడదు. వైద్యులు, ఫిట్‌నెస్ నిపుణుల సూచన ప్రకారం శరీర బరువులో 5 నుంచి 10 శాతం వరకు మాత్రమే బరువు ఉన్న బ్యాగ్‌తో ప్రారంభించడం మంచిది. ఉదాహరణకు 60 కిలోల బరువు ఉన్న వ్యక్తి 3 నుంచి 6 కిలోల బరువుతో మొదలు పెట్టవచ్చు. క్రమంగా శరీరం అలవాటు పడిన తర్వాత బరువును కొద్దికొద్దిగా పెంచుకోవచ్చు.రకింగ్ చేసే సమయంలో నాణ్యమైన బ్యాక్‌ప్యాక్‌ను ఉపయోగించాలి. బరువు రెండు భుజాలపై సమానంగా పడేలా బ్యాగ్‌ను సర్దుకోవాలి. నడుస్తున్నప్పుడు శరీరాన్ని నిటారుగా ఉంచి, సరైన భంగిమలో నడవడం అవసరం. మోకాళ్లు, నడుము లేదా వెన్నెముక సమస్యలు ఉన్నవారు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారు వైద్యుల సలహా తీసుకున్న తర్వాతే రకింగ్ ప్రారంభించాలి.ఫిట్‌నెస్‌ను మెరుగుపరచుకోవాలనుకునే వారు, బరువు తగ్గాలనుకునే వారు, సాధారణ వాకింగ్‌ను మరింత సవాలుగా మార్చుకోవాలనుకునే వారికి రకింగ్ మంచి ఎంపిక. అయితే ప్రారంభంలో తక్కువ బరువుతో, తక్కువ దూరం నడిచి క్రమంగా వ్యాయామ తీవ్రతను పెంచుకుంటేనే పూర్తి ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# ధరణిలో 10 వేల ఎకరాల రికార్డుల మాయం

**హైదరాబాద్, జూలై 6, పెన్ పవర్:**
తెలంగాణ రియల్ ఎస్టేట్ , రాజకీయ వర్గాల్లో ధరణి పోర్టల్ అక్రమాల వ్యవహారం మరోసారి తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో అడ్డగోలుగా సాగిన భూ రికార్డుల మార్పులపై తాజా ఫోరెన్సిక్ ఆడిట్‌లో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10,000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూముల యాజమాన్య హక్కులను కొందరు కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చేసి భారీ కుంభకోణానికి పాల్పడినట్లు ఆధారాలు లభ్యమయ్యాయి.ఈ మెగా ల్యాండ్ స్కామ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈ అక్రమాలపై సమగ్ర విచారణకు ఆదేశించింది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష అనంతరం, ప్రభుత్వం ఈ కుంభకోణంపై దర్యాప్తు చేయడానికి కలెక్టర్లు, ఐటీ నిపుణులు, ఐపీఎస్ అధికారులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని అధికారికంగా నియమించింది. ఈ 10,000 ఎకరాల భూ రికార్డుల మార్పిడి అసలు ఏయే సమయాల్లో జరిగింది? ఏయే మోడ్యూల్స్ ద్వారా డేటాను ట్యాంపరింగ్ చేశారు? దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? అనే కోణంలో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.ప్రాథమిక విచారణ , ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికల ప్రకారం.. ధరణి పోర్టల్ సిస్టమ్ ఆర్కిటెక్చర్‌లో ఉన్న సాంకేతిక లోపాలను, సెక్యూరిటీ లూప్‌హోల్స్‌ను కొందరు స్వార్థపరులు తమకు అనుకూలంగా వాడుకున్నట్లు తేలింది. గత ప్రభుత్వ హయాంలో పోర్టల్ నిర్వహణ చూసిన కొన్ని ప్రైవేట్ ఏజెన్సీల పాత్ర, అలాగే కొందరు రెవెన్యూ అధికారుల లాగిన్ ఐడీల దుర్వినియోగం దీని వెనుక ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో ఏకంగా అర్హత లేని వ్యక్తుల పేరిట పట్టా మార్పిడులు చేయడం, విస్తీర్ణాల లెక్కలు మార్చడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు.ఈ వ్యవహారంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, భూ రికార్డుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని రెవెన్యూ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం తెలంగాణలో ధరణి స్థానంలో తీసుకొచ్చిన కొత్త భూ భారతి పోర్టల్ ఆర్కిటెక్చర్‌ను కూడా మరింత పటిష్టం చేయాలని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ప్రత్యేక కమిటీ రాబోయే 15 రోజుల్లోగా తన పూర్తి నివేదికను సమర్పించనుండటంతో.. ఈ భూ దందాకు అడ్డుపడ్డ పెద్దల పేర్లు బయటకు రావడం ఖాయమని, త్వరలోనే లీగల్ గా క్రిమినల్ చర్యలు ఉంటాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# అమరావతి పేరు మార్పు సాధ్యమా



**విజయవాడ, జూలై 6, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు వ్యవహారంలో జగన్ రెడ్డి వ్యూహాలు రోజుకో కొత్త రూపం దాలుస్తున్నాయి. రాజకీయంగా నినాదాలు ఇవ్వడం సులువే కానీ, వాటికి చట్టబద్ధత కల్పించడం వేరు. అధికారంలోకి వస్తే కేవలం ఒక జీవో ద్వారా లేదా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానాల ద్వారా రాజధాని లేదా రాజధాని పేరు మార్చలేరు. ఎందుకంటే పార్లమెంట్‌లో ఉభయ సభల ఆమోదంతో 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం' ను తీసుకువచ్చింది. ఈ చట్టంలో స్పష్టంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నగరం పేరు 'అమరావతి' అని లిఖితపూర్వకంగా పొందుపరిచారు. భారత రాజ్యాంగం ప్రకారం ఒకసారి పార్లమెంట్ చట్టం చేసిన తర్వాత, దాని పరిధిలోని అంశాలను మార్చే అధికారం ఏ రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, ముఖ్యమంత్రికి గానీ ఉండదు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 254 ప్రకారం కేంద్ర చట్టానికి, రాష్ట్ర ప్రభుత్వ చట్టానికి లేదా ఆలోచనకు మధ్య ఘర్షణ వస్తే.. కేంద్రం చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది. కాబట్టి జగన్ అసెంబ్లీలో మావిగన్ అని తీర్మానం చేసినా, అది పార్లమెంట్ చట్టం ముందు చెల్లకుండా పోతుంది. ఒకవేళ భవిష్యత్తులో జగన్ ముఖ్యమంత్రి అయ్యి, అమరావతి పేరును మార్చాలని పట్టుబడితే.. ఆయన ముందున్న ఏకైక మార్గం ఢిల్లీలోని పార్లమెంట్‌లో మళ్లీ సవరణ బిల్లు పెట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడం.ప్రస్తుత , రాబోయే జాతీయ రాజకీయ సమీకరణాల్లో ఏ కేంద్ర ప్రభుత్వమైనా ఏపీ రాజధాని పేరును మార్చడానికి పార్లమెంట్‌లో మళ్లీ బిల్లు పెట్టే సాహసం అస్సలు చేయదు. ఎందుకంటే అమరావతి అనేది కేవలం ఒక ప్రాంతం పేరు కాదు.. అది అంతర్జాతీయంగా బ్రాండ్ ఇమేజ్ సొంతం చేసుకున్న నగరం. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థలు అమరావతి అనే నిర్దిష్ట పేరుతోనే వేల కోట్ల రూపాయల రుణాల ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇప్పుడు పేరు మారిస్తే ఆ గ్లోబల్ ఒప్పందాలన్నీ లీగల్ చిక్కుల్లో పడతాయి.ఇక మరో ముఖ్యమైన అడ్డంకి.. సుప్రీంకోర్టు , హైకోర్టుల తీర్పులు. అమరావతి ల్యాండ్ పూలింగ్ ఒప్పందాలలో రాజధాని నగరం అమరావతి అభివృద్ధి అనేది ఒక ముఖ్యమైన లీగల్ క్లాజ్. పేరు మార్పు అనేది కేవలం అక్షరాల మార్పు కాదు, అది ఒక చట్టబద్ధమైన అస్తిత్వాన్ని మార్చడమే అవుతుంది. పేరు మార్చడం ద్వారా ల్యాండ్ పూలింగ్ ఒప్పందాల ఉద్దేశాన్ని నీరుగార్చాలని చూస్తే.. భూములిచ్చిన 29,000 మంది రైతులు కోర్టును ఆశ్రయించవచ్చు. గతంలో మూడు రాజధానుల పేరుతో జగన్ ప్రభుత్వం చేసిన ప్రయోగాలను కోర్టులు ఎలా నిలిపివేశాయో అందరికీ తెలుసు. మావిగన్ జగన్ తన లాంటి వాళ్లను మభ్యపెట్టడానికి పనికొచ్చే ఒక పొలిటికల్ స్టంట్ మాత్రమే తప్ప.. పార్లమెంట్ చట్టం అనే గట్టి లీగల్ గోడను దాటి అమరావతి పేరును కూడా మార్చడం జగన్ తరం కాదు.

ట్రంక్ ఇన్‌ఫ్రాకు అడ్డం పడే భూముల సేకరణ

రాజధాని అమరావతిలో ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల నిర్మాణానికి ఎదురవుతున్న భూ సమస్యల అడ్డంకులను అధిగమించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు భూసమీకరణ విధానంలో తమ స్థలాలను ఇవ్వడానికి నిరాకరిస్తూ మొండిగా వ్యవహరిస్తున్న కొంతమంది నుంచి చట్టపరమైన భూసేకరణ ప్రక్రియ ద్వారా భూములను స్వాధీనం చేసుకోవడానికి సర్కార్ సర్వం సిద్ధం చేసింది. నిర్దిష్ట భూసేకరణ పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించనున్నారు. కొంతకాలంగా సాగుతున్న ఈ వివాదంలో ఇప్పటికే కొంతమంది రైతులు పరిస్థితులను అర్థం చేసుకుని తమ భూములను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించారు. అయితే, మిగిలిన కొద్దిమంది మాత్రం తమ భూములు ప్రాజెక్టుల నిర్మాణానికి అత్యంత కీలకం కావడాన్ని ఆసరాగా చేసుకుని, మార్కెట్ ధర కంటే అత్యధిక పరిహారం ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం అత్యంత స్పష్టమైన లైన్ తీసుకుంది. రాజధాని కోసం భూములిచ్చిన ఇతర రైతులకు ఏ రకమైన ప్యాకేజీ ఇచ్చామో, అదే నిబంధనలు వీరికీ వర్తిస్తాయని, అంతకుమించి ఒక్క రూపాయి కూడా అదనంగా ఇచ్చేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది.ఈ క్రమంలో భూసమీకరణ , భూసేకరణ ల మధ్య ఉన్న వ్యత్యాసాలను అధికారులు రైతులకు స్పష్టం చేస్తున్నారు. ఒకవేళ రైతులు మొండితనం వీడి భూసమీకరణ కు అంగీకరిస్తే.. వారికి చట్టప్రకారం వచ్చే ఏటా కౌలుతోపాటు, రుణమాఫీ , భవిష్యత్తులో కోట్లాది రూపాయల విలువైన పూలింగ్ ప్లాట్స్ దక్కుతాయి. కానీ, ప్రభుత్వం చట్టపరంగా 'భూసేకరణ'కు వెళ్తే మాత్రం.. కేవలం 2013 భూసేకరణ చట్టం ప్రకారం లెక్కగట్టి వన్-టైమ్ సెటిల్‌మెంట్ కింద డబ్బులు మాత్రమే చేతిలో పెడతారు. ఆ తర్వాత వారికి ఎలాంటి పూలింగ్ ప్లాట్స్ గానీ, రాజధాని అభివృద్ధి లబ్ధి గానీ దక్కే అవకాశం ఉండదు.ఇప్పటికీ పట్టుదలకు పోయి నిబంధనలకు అడ్డుపడుతున్న వారిపై సోమవారం నుండి ప్రభుత్వం నిర్బంధ భూసేకరణ అస్త్రాన్ని ప్రయోగించబోతోంది. దీనికి సంబంధించిన లీగల్ నోటిఫికేషన్లు, పరిహారం అవార్డుల ప్రకటన , బాధితుల ఖాతాల్లో నిధులు జమ చేసే ప్రక్రియతో సహా అన్ని రకాల సాంకేతిక, పరిపాలనాపరమైన ఏర్పాట్లను సీఆర్‌డీఏ , రెవెన్యూ యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది. దీంతో ట్రంక్ ఇన్‌ఫ్రా రోడ్లు, ఇతర మౌలిక వసతుల నిర్మాణానికి ఉన్న చివరి అడ్డంకి కూడా తొలగిపోనుంది.

# జోసఫ్ రావణ్ చుట్టూ బిగిస్తున్న ఉచ్చు

**ఏలూరు, జూలై 6పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అడ్డగోలు వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో యూట్యూబర్ బచలకురి జోసఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ ను జూలై 1, 2026 న హైదరాబాద్‌లో ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పట్నుంచి పలు కేసుల్లో అరెస్టవుతూనే ఉన్నారు. ఆయన అరెస్ట్‌ను కొందరు ప్రశ్నించే గొంతుకను నొక్కేస్తున్నారు.. ప్రజాస్వామ్యానికి విఘాతం అంటూ కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఈ ప్రశ్న అనే పేరు పెట్టుకున్న మేధావి ఏం ప్రశ్నించారో ఎవరైనా చెప్పగలరా?అసలు ఈ జోసఫ్ రావణ్ అనే వ్యక్తి తన యూట్యూబ్ ఛానల్‌లో ఏపీ ప్రభుత్వ విధానాలపై ఏమైనా ప్రశ్నించాడా? పవన్ కల్యాణ్ పరిధిలోని పంచాయతీ రాజ్ లేదా అటవీ శాఖల్లోని లోపాలపై సమాచార హక్కు చట్టం ద్వారా నిలదీశాడా? లేక ప్రజాస్వామ్యయుతంగా ప్రజలకు తెలియాల్సిన అంశాలపై చర్చలు జరిపాడా? అని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే షాకింగ్ నిజాలు బయటపడుతున్నాయి. ఈ 'ప్రశ్న రావణ్' ఛానల్ మొత్తం వెతికినా ఎక్కడా ప్రజలకు ఉపయోగపడే ఒక్కటంటే ఒక్క విమర్శనాత్మక ప్రశ్న కూడా కనిపించదు. అన్నీ అయితే దైవదూషణలు..లేకపోతే పవన్ కల్యాణ్‌పై నిందలు. చివరికి టెర్రరిస్టుల్ని కూడా సమర్థించే బాపతు.జూన్ 28న ఏలూరులో జరిగిన ఒక సభలో ఈయన చేసిన వ్యాఖ్యలే ఈ వరుస అరెస్టులకు కారణమయ్యాయి. అక్కడ ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లపై చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య పరిధిని దాటిపోయాయి. ఆయన మాట్లాడిన భాష, వాడిన పదజాలం ఏమాత్రం నాగరిక సమాజం ఆమోదించేలా లేవని సగటు నెటిజన్లు స్క్రీన్‌షాట్లతో సహా ఎండగడుతున్నారు. కేవలం పొలిటికల్ మైలేజ్ కోసం, వ్యూస్ కోసం పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని, ఆయన సతీమణిని టార్గెట్ చేస్తూ అత్యంత అసభ్యకరంగా థంబ్‌నైల్స్ పెట్టడం, లైవ్‌లలో బూతులు తిట్టడమే ఈయన నిత్యకృత్యంగా మారిందని రికార్డులు చెబుతున్నాయి.జోసఫ్ రావణ్ కేవలం రాజకీయ నాయకులను మాత్రమే కాదు.. సనాతన ధర్మాన్ని, హిందూ దేవుళ్లను టార్గెట్ చేస్తూ అత్యంత దారుణమైన రీతిలో దైవదూషణలకు పాల్పడిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. మతాల మధ్య చిచ్చు పెట్టేలా, ఒక వర్గాన్ని కించపరుస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై గతంలోనూ కేసులు నమోదయ్యాయి. సలు ఎలాంటి నైతికత లేని ఇటువంటి సోషల్ మీడియా అబ్యూజర్‌ను సమర్థిస్తూ.. కొందరు దీనిని ప్రజల గొంతుకను నొక్కేయడం అని అభివర్ణించడం ఘోరమైన విషయం. ప్రశ్న అనే పవిత్రమైన పదానికి ముసుగు వేసి.. మత దూషణలు, బూతుల పురాణం అందుకునే వాళ్లను అరెస్ట్ చేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడదు.. పైగా మరింత స్వచ్ఛంగా మారుతుంది.

**ఉపా కేసు**

యూట్యూబర్ బచ్చులకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ ను గన్నవరం పోలీసులు సాధారణ సోషల్ మీడియా కేసుల్లో అరెస్టు చేయలేదు. ఆయనపై గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఉపా చట్టం కింద కేసు నమోదైంది. ఈ అఫీషియల్ అరెస్ట్ నోటీసు ప్రకారం.. ఉపా చట్టంలోని సెక్షన్ 13 , సెక్షన్ 39 ప్రకారం ఉగ్రవాద సంస్థలకు మద్దతునిచ్చిన కారణంగా ఈ కేసులు పెట్టారు. అత్యంత కఠినమైన దేశద్రోహ ముద్ర కలిగిన సెక్షన్లను చేర్చారు. వీటితో పాటు భారతీయ న్యాయ సంహిత లోని పలు తీవ్రమైన సెక్షన్ల కింద నక్కపల్లి టోల్ ప్లాజా వద్ద పోలీసులు ఈ అధికారిక అరెస్ట్ ప్రక్రియను పూర్తి చేశారు.సాధారణ క్రిమినల్ చట్టాలతో పోలిస్తే ఉపా చట్టం చాలా భిన్నమైనది, అత్యంత పవర్‌ఫుల్ అయినది. సాధారణ కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసిన 24 గంటల లోపు తప్పనిసరిగా స్థానిక మేజిస్ట్రేట్ లేదా కోర్టు ముందు ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కానీ, ఉపా చట్టం కింద నిర్బంధించినప్పుడు పోలీసులకు లీగల్ గా అదనపు సమయం , కొన్ని మినహాయింపులు లభిస్తాయి. ఉపా సెక్షన్ల కింద నిందితుడిని కోర్టు అనుమతితో గరిష్టంగా 30 రోజుల వరకు పోలీస్ కస్టడీకి తీసుకునే వెసులుబాటు ఉంటుంది. అలాగే, సాధారణ కేసుల్లో 60 నుండి 90 రోజుల్లోగా చార్జ్‌షీట్ దాఖలు చేయాల్సి ఉండగా.. ఉపా కేసుల్లో దర్యాప్తు సంస్థలకు కోర్టు అనుమతితో 180 రోజుల వరకు చార్జ్‌షీట్ దాఖలు చేసే గడువు లభిస్తుంది.ఈ చట్టం కింద ఒకసారి కేసు నమోదైతే నిందితుడికి అంత సులభంగా బెయిల్ లభించదు. ఉపా చట్టంలోని సెక్షన్ 43డ(5) ప్రకారం.. నిందితుడిపై మోపిన ఆరోపణలు ప్రాథమికంగా నిజమే అని కోర్టు భావిస్తే, సదరు నిందితుడికి బెయిల్ నిరాకరించే సంపూర్ణ హక్కు న్యాయస్థానాలకు ఉంటుంది. సాధారణ కేసుల్లో బెయిల్ అనేది ఒక హక్కు, జైలు అనేది మినహాయింపు అనే సూత్రం వర్తిస్తుంది కానీ, ఉపా చట్టం కిందకు వచ్చేసరికి ఆ నిబంధన తలకిందులవుతుంది. అందువల్లనే, ఈ కేసులో నిందితుడి తరఫున వాదించే లాయర్లకు కూడా కోర్టుల్లో తక్షణ ఉపశమనం లేదా బెయిల్ తీసుకురావడం చట్టపరంగా ఒక పెద్ద సవాలుగా మారుతుంది.కూటమి ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాలలో వాక్స్వాతంత్రం హద్దులు దాటి దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం కలిగించేలా వీడియోలు పోస్ట్ చేశారనే ఆరోపణలు ప్రశ్న రావణ్‌పై ఉన్నాయి. ఉగ్రవాదుల్ని సమర్థిస్తూ ఆయన వీడియోలు చేశారు. దేశద్రోహ శక్తుల నుండి, బయటి వ్యక్తుల నుండి అందుతున్న ఫండింగ్ తోనే వ్యవస్థలను బద్నాం చేయడానికి ఇటువంటి కుట్రలు పన్నారనే కోణంలో గన్నవరం పోలీసులు లోతైన దర్యాప్తు ప్రారంభించారు. గత నాలుగు రోజుల్లో వరుసగా ఐదు కేసుల్లో బెయిల్ పొందినప్పటికీ.. ఇప్పుడు ఉపా లాంటి దేశ రక్షణ చట్టం తెరపైకి రావడంతో ఆయన ఇప్పుడల్లా బయటకు రావడం కష్టంగా మారనుంది

# ఏపీలో పోలీసింగ్ విప్లవం.. సర్కార్ కీలక నిర్ణయం

**గుంటూరు, జూలై 6 పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలోపేతం చేసేందుకు మరియు పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా రక్షణ వ్యవస్థను ఆధునీకరించేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్తగా మరో మూడు పోలీస్ కమిషనరేట్లను ఏర్పాటు చేసేందుకు అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం జిల్లా ఎస్పీల పరిధిలో ఉన్న తిరుపతి, గుంటూరు, రాజమండ్రి జిల్లాలను పూర్తి స్థాయి పోలీస్ కమిషనరేట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.నగరాల శరవేగవంతమైన విస్తరణ, మారుతున్న నేరాల స్వరూపం, ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా అదుపు చేయడమే లక్ష్యంగా ఈ కీలక అడుగు పడింది. ఈ నూతన కమిషనరేట్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలంటూ రాష్ట్ర పోలీస్ బాస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా రంగంలోకి దిగారు. తిరుపతి, గుంటూరు, రాజమండ్రి జిల్లాల ఎస్పీలకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపాదిత కమిషనరేట్లకు సంబంధించిన భౌగోళిక సరిహద్దులు, కొత్తగా ఏర్పాటు చేయాల్సిన ప్రత్యేక పోలీస్ వింగ్స్, శాంతిభద్రతల నిర్వహణకు కావలసిన సిబ్బంది సంఖ్య మరియు మౌలిక వసతుల లభ్యతపై సమగ్రమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.ఈ పూర్తి స్థాయి నివేదికలను వీలైనంత త్వరగా మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలని డీజీపీ ఆదేశించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాల్లో మాత్రమే కమిషనరేట్ వ్యవస్థ విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పుడు కొత్తగా తిరుపతి, గుంటూరు, రాజమండ్రి నగరాలు కూడా ఈ జాబితాలో చేరితే పట్టణ ప్రాంతాల్లో పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది. కమిషనరేట్ వ్యవస్థ అమలులోకి వస్తే ఐపీఎస్ కేడర్ అధికారులు నేరుగా కమిషనర్‌గా బాధ్యతలు చేపడతారు, దీనివల్ల నిర్ణయాలు వేగంగా తీసుకోవడానికి, ఆధునిక సాంకేతికతతో నేరాలను అదుపు చేయడానికి వీలవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## గాదె సాయికృష్ణ కేసుకీలక సాక్ష్యాలు

**విజయవాడ, జూలై 6: పెన్ పవర్:** విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ హత్య కేసు దర్యాప్తులో ఊహించని పరిణామాలు వెలుగులోకి వస్తున్నాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్ టెర్రస్‌పై క్లూస్ టీమ్ మరియు సిట్ అధికారులు జరిపిన తనిఖీల్లో లభించిన మానవ ఎముకల అవశేషాలు, బూడిద, ఒక స్టీల్ బ్రాస్‌లెట్, కాలిన వస్తువులను కేసులో అత్యంత కీలకమైన సాక్ష్యాలుగా గుర్తించారు. నిందితులు నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి పోలీస్ స్టేషన్ భవనంపైనే సాయికృష్ణ శవాన్ని దహనం చేశారనే అనుమానాలు బలపడుతున్న నేపథ్యంలో, దొరికిన ఆధారాలు చట్టపరంగా నిలబడేలా చేసేందుకు న్యాయాధికారి (మెజిస్ట్రేట్) సమక్షంలో వాటికి పక్కాగా సీల్ వేసి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కి తరలించారు.ఈ కేసులో లభించిన శరీర అవశేషాలు మరియు ఎముకలు ఖచ్చితంగా గాదె సాయికృష్ణవేనా కాదా అనే విషయాన్ని శాస్త్రీయంగా నిరూపించడం పోలీసులకు ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారింది. ఎముకలు పూర్తిగా కాలిపోయి ఉండటంతో కేవలం ఫోరెన్సిక్ నివేదిక ద్వారానే అసలు నిజాలు బయటకు రానున్నాయి. టెర్రస్‌పై దొరికిన స్టీల్ బ్రాస్‌లెట్ సాయికృష్ణ ధరించేదేనని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ, కోర్టులో నిందితులకు శిక్ష పడాలంటే పక్కా సైంటిఫిక్ నివేదిక అవసరం కాబట్టి సిట్ అధికారులు ఫోరెన్సిక్ విశ్లేషణపైనే పూర్తి నిఘా పెట్టారు.అవశేషాల గుర్తింపును వంద శాతం చట్టబద్ధంగా ఖరారు చేసేందుకు సిట్ అధికారులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి యొక్క డీఎన్ఏ నమూనాలను సేకరించి, వాటిని కృష్ణలంక పీఎస్ టెర్రస్‌పై లభించిన ఎముకల నుంచి తీసే డీఎన్ఏతో సరిపోల్చాలని యోచిస్తున్నారు. ఈ డీఎన్ఏ రిపోర్ట్ గనుక మ్యాచ్ అయితే, పోలీస్ స్టేషన్ భవనంపైనే హత్య లేదా శవదహనం జరిగిందనే భయంకరమైన నిజం అధికారికంగా నిర్ధారణ అవుతుంది. ఈ ఫోరెన్సిక్ మరియు డీఎన్ఏ నివేదికల ఆధారంగానే సిట్ అధికారులు తదుపరి చార్జ్‌షీట్ దాఖలు చేయనున్నారు.

# వారం రోజుల పాటు లోకేష్ సౌత్ కొరియా టూర్

**విజయవాడ, జూలై 6పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌కు భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మరో కీలక విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. దక్షిణ కొరియా ప్రభుత్వ అధికారిక ఆహ్వానం మేరకు ఆయన జులై 5 నుంచి వారం రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనున్నారు. 11వ తేదీ వరకు సాగే ఈ 7 రోజుల హై-ప్రొఫైల్ పర్యటనలో భాగంగా కొరియా రాజధాని సియోల్ వేదికగా ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలు, ఆటోమొబైల్ , సెమీకండక్టర్ రంగాల ప్రతినిధులతో లోకేశ్ వరుసగా భేటీ కానున్నారు. ఇటీవల ఢిల్లీలో దక్షిణ కొరియా రాయబారి లీ సియోంగ్-హోతో జరిగిన ప్రాథమిక చర్చల కొనసాగింపుగానే ఈ పర్యటన ఖరారైంది.మంత్రి లోకేశ్ దక్షిణ కొరియా పర్యటన షెడ్యూల్ అత్యంత బిజీగా, పక్కా రోడ్‌మ్యాప్‌తో డిజైన్ చేశారు. . జులై 5న సియోల్ చేరుకోనున్న ఆయన, తొలిరోజు అక్కడ నివసిస్తున్న భారతీయ డయాస్పోరా, తెలుగు వారితో ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం జులై 6న కొరియాకు చెందిన టాప్ టెక్ స్టార్టప్స్ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని ఏపీలోని అనుకూల వాతావరణాన్ని వివరిస్తారు. అదే రోజు హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం ప్రెసిడెంట్ టకేషి యొకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యుంగ్ లీతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులపై కీలక చర్చలు జరుపుతారు.ఈ టూర్ లో అత్యంత కీలకమైన ఘట్టం జులై 7, 8 తేదీల్లో జరగనుంది. ప్రపంచ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ ప్రధాన కార్యాలయం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు సమావేశంలో పాల్గొని, ఎల్జీ అనుబంధ సంస్థల గ్లోబల్ టీమ్స్‌తో ఏపీలో ప్లాంట్ల ఏర్పాటుపై చర్చిస్తారు. జులై 8, 9 తేదీల్లో కొరియన్ మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు, కొరియా దేశ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఉ ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో ద్వైపాక్షిక పారిశ్రామిక సంబంధాలపై లోకేశ్ భేటీ అవుతారు.పర్యటన ముగింపు రోజైన జులై 10న కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం లోకేశ్ సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షో నిర్వహించనున్నారు. విశాఖపట్నంలో రాబోయే రోజుల్లో జరగనున్న ప్రతిష్ఠాత్మక సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ ను విజయవంతం చేయడమే లక్ష్యంగా కొరియా కంపెనీలను ఆహ్వానిస్తూ ఈ రోడ్ షో సాగనుంది. పర్యటన ముగించుకుని జులై 11న ఆయన తిరిగి ఏపీకి చేరుకుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామిక వేగాన్ని పెంచిన తరుణంలో.. ఎలక్ట్రానిక్స్, ఈవీ వాహనాలు, సెమీకండక్టర్ రంగాల్లో దక్షిణ కొరియా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వందల కోట్ల మేర భారీ ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని పరిశ్రమల శాఖ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## జనసేన విస్తరణ ఆశలు...



**విశాఖపట్టణం, జూలై 6 పెన్ పవర్:** ఏపీలో మరో నెల రోజులలో మంత్రి వర్గ విస్తరణ జరుగుతుంది అని ప్రచారం జోరుగా సాగుతోంది. ఆగస్టు నెలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని అపుడు విస్తరణ చేపడతారు అని వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం మంత్రి వర్గంలో 24 మంది ఉన్నారు. ఒక బెర్త్ ఖాళీగా ఉంది. అయితే కొత్తగా చేపట్టే విస్తరణరలో కనీసంగా అరడజన్ మందిని తీసుకుంటారు అని వార్తలు వినవస్తున్నాయి. అలాగే కూటమి ప్రభుత్వంలో మిత్ర పార్టీలు అయిన జనసేనకు బీజేపీకి మరింత ప్రాతినిధ్యం లభిస్తుంది అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జనసేన విషయం తీసుకుంటే రెండు బెర్తులు అదనంగా కేటాయిస్తారు అని అంటున్నారు. జనసేనకు ఇప్పటికే ముగ్గురు మంత్రులు ఉన్నారు. కొత్తగా విస్తరణ తరువాత ఈ సంఖ్య ఐదుకు చేరువ అవుతుందని అంటున్నారు. ఇక జనసేనలో ఇప్పటికే పవన్ ఉప ముఖ్యమంత్రిగా కీలక హోదాలో ఉన్నారు. ఆయనకు అయిదు ప్రాధాన్యత కలిగిన శాఖలను కేటాయించారు. అలాగే మరో రెండు బెర్తులు కూడా ఇచ్చారు. పౌరసరఫరాల శాఖ మంత్రిగా నాదెండ్ల మనోహర్ పనిచేస్తున్నారు. పర్యాటక శాఖ మంత్రిగా కందుల దుర్గేష్ ఉన్నారు. వీరితో పాటు మరో ఇద్దరు జత చేరుతారు అని అంటున్నారు. సీనియర్ నేత అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామక్రిష్ణకు గోల్డెన్ చాన్స్ దక్కుతుందని అంటున్నారు. ఆయనకు మంత్రి పదవి ఇచ్చే విషయంలో పవన్ కళ్యాణ్ అనేక సమీకరణలను చూసి మరీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు అని అంటున్నారు. ఉత్తరాంధ్రాలో ప్రముఖ బీసీ నేతగా కొణతాల ఉన్నారు. విశాఖ జిల్లాలో మూడు నుంచి నాలుగు అసెంబ్లీ అలాగే అనకాపల్లి ఎంపీ సీటుని ప్రభావితం చేసే బలమైన గవర సామాజిక వర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా ప్రతినిధ్యం వహిస్తున్నారు. ఉత్తరాంధ్రాలో జనసేనను విస్తరించాలని రానున్న కాలంలో జనసేనను ఆ ప్రాంతంలో మరింతగా బలం పెంచేలా చేయాలని పవన్ వ్యూహ రచన చేస్తున్నారు. బీసీల జిల్లాలుగా ఉన్న ఉత్తరాంధ్రా నుంచి వివాద రహితుడు ఉత్తరాంధ్రా సమస్యల మీద పూర్తి అవగాహన ఉన్న రామక్రిష్ణకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా రానున్న కాలంలో ఉత్తరాంధ్రాలో పట్టు పెంచుకోవాలని పవన్ చూస్తున్నారు అని అంటున్నారు. జనసేన రాజకీయ పరంగా చూస్తే పవన్ కనుక కొణతాలను ఎంచుకుంటే అది వ్యూహాత్మకంగా సరైన నిర్ణయం అవుతుందని అంటున్నారు. జనసేనకు రానున్న రోజులలో ఉత్తరాంధ్రాలో పట్టు మరింతగా పెరిగేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అంటున్నారు. క్కడ మరో ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. మెగా బ్రదర్ జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబుకు మంత్రి పదవి దక్కుతుంది అన్నదే ఆ ప్రచారం సారాంశం. ఆయన ఎమ్మెల్సీగా నెగ్గింది మంత్రి కావడానికి అని చెప్పుకున్నారు. ఇక చంద్రబాబు సైతం నాగబాబుని కేబినెట్ లోకి తీసుకుంటామని కూడా గతంలో హామీ ఇచ్చారు. ఆ విధంగా చూస్తే జనసేనకు మరో రెండు మంత్రి పదవులు దక్కినట్లే అని అంటున్నారు. ప్రభుత్వంలోనూ జనసేన వాయిస్ కూడా బాగా పెరుగుతుందని అలాగే పార్టీ పరంగా జనసేన మరింత పటిష్టం అయ్యేందుకు దోహదపడుతుందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే కొణతాలకు గోల్డెన్ చాన్స్ దగ్గరలోనే ఉంది అని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# 'ప్రేమకోసమై..' చిక్కుల్లో పడుతున్న ప్రియులు!

ప్రేమ కోసమై.. వలలో పడెనే పాపం పసివాడు.. అనే పాట వినని వారు ఉండరు. ఇప్పుడు దేశంలో జరుగు తున్న పరిణామాలను గమనిస్తే.. ప్రేమ కోసం. ప్రియురాళ్ల కోసం.. కొందరు యువకులు తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దొంగతనాలు.. జైలు దూకి పారిపోవడం.. అధికారులతో వివాదాలు తెచ్చు కోవడం వంటివి ప్యూర్ గా ప్రియురాళ్ల కోసమేనని వారు చెబుతున్నారు. దీంతో ప్రేమ కోసమే వారు చేస్తున్నా.. చట్టాలు మాత్రం ప్రియులను కటకటాల వెనక్కి నెడుతున్నాయి. నాలుగు రోజుల కిందట నాసిక్‌లో జరిగిన అతి పెద్ద దొంగతనం వెలుగు చూసింది. ఓ బంగారం దుకాణం లో ఉద్యోగాల కోసం చేరిన ప్రేయసీ ప్రియులు.. అక్కడే చోరీ చేసి.. దొరికి పోయారు. అదేమంటే.. తన ప్రియురాలు ముచ్చటపడిందని.. ఒంటి నిండా బంగారంతో మెరిసిపోవాలని భావించిందని.. అందుకే.. తాను విధిలేక దొంగతనం చేశానని ప్రియుడు చెప్పుకొచ్చాడు. బంగారాన్ని రికవరీ చేసినా.. అతనిపై పోలీసులు కానీ.. చట్టం కానీ.. ఎక్కడా జాలి పడలేదు. ప్రస్తుతం జైల్లో ఉన్నాడు. తాజాగా తెలంగాణలోనూ ప్రియురాలి కోసం ఓ ప్రియుడు జైలు గోడలు దాటి పారిపోవడం సంచలనంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లా అమరచింతకు చెందిన కిశోర్ కుమార్.. ఓ యువతిని ప్రేమించాడు. అయితే.. మరోవైపు.. అతనిని ప్రేమించిన మరో అమ్మాయి.. తనను మోసం చేశాడంటూ.. కిశోర్‌పై పోక్సో కేసు పెట్టింది. దీంతో కిశోర్ ను అరెస్టు చేసిన పోలీసులు.. రిమాండ్ నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించారు. ఇక్కడే గతవారం నుంచి అతను ఉంటున్నాడు. అయితే.. తాను ప్రేమించిన ప్రియురాలిని కలుసుకోవాలని అనుకున్న కిశోర్.. సోమవారం తెల్లవారు జామున.. బ్యారక్ నుంచి బాత్రూంకు వెళ్లివస్తానని చెప్పి.. అటు నుంచి నాలుగు తుండుగుడ్డలతో పేనిన తాడును వినియోగించి.. జైలు గోడలు దూకి.. బయటకు వచ్చేశాడు. తోటి ఖైదీలకు.. తాను తన ప్రియురాలిని కలుసుకునేందుకు వెళ్లిపోతున్నానని చెప్పినట్టు పోలీసులకు వారు తెలిపారు. దీంతో పోలీసులు వెతుకులాట ప్రారంభించారు. విశాఖలో తాను ప్రేమించిన ప్రియురాలికి పెళ్లి నిశ్చయం అయిందని తెలుసుకున్న ఓ ప్రియుడు నాలుగు రోజుల కిందట ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. ఈ క్రమంలో పోలీసులు.. ఎంట్రీ ఇచ్చి.. అతనిని అరెస్టు చేయగా వారిపై తిరుగుబాటు చేసి.. కానిస్టేబుల్‌ను గాయపరిచిన సంఘటన సంచలనంగా మారింది. ఈ ఘర్షణకు ప్రేమే కారణమని అధికారులు చెబుతున్నారు. అయితే..ఇప్పుడు అతనిపై రెండు నుంచి నాలుగు కేసులు పెట్టారు. కానిస్టేబుల్ పై చేయి చేసుకున్న నేరం నమోదైంది. ఇలా.. ప్రేమ కోసం ప్రియులు చిక్కుల్లో పడుతుండడం గమనార్హం.

# ఒకే బైక్‌పై 10 మంది.. ప్రాణాలను పణంగా పెట్టి పాకిస్థానీయుల వింత ప్రయాణం..

సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ప్రపంచవ్యాప్తంగా ఎన్నో విచిత్రాలు మనకు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మన పొరుగు దేశమైన పాకిస్థాన్ గురించి వచ్చే వార్తలు.. అక్కడ జరిగే సంఘటనలు నెటిజన్లకు ఒక రేంజ్‌లో వినోదాన్ని, ఆశ్చర్యానికీ గురిచేస్తుంటాయి. అంతర్జాతీయ వేదికలపై ఆ దేశ పరిస్థితి ఎలా ఉన్నా, సోషల్ మీడియాలో మాత్రం పాకిస్థాన్ కంటెంట్ ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటుంది. అక్కడ జరిగే కొన్ని వింతలు చూస్తే ప్రపంచానికి స్ట్రెస్ బస్టర్‌లా అనిపించక మానదు. తాజాగా అలాంటి ఒక విస్తుపోయే ఘటనే నెటిజన్లను ముక్కున వేలేసుకునేలా చేస్తోంది.

**ట్యాంకుపై డ్రైవర్.. బైక్‌పై ఏకంగా పది మంది!**

సాధారణంగా బైక్ పై ఇద్దరు ప్రయాణించడం చట్టబద్ధం. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో ముగ్గురు వెళ్లడం చూస్తుంటాం. కానీ పాకిస్థాన్‌లోని ఓ వీధిలో ఏకంగా పది మంది ఒకే బైక్‌పై ప్రయాణిస్తున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ప్రయాణం సాగిన తీరు చూస్తే ఎవరికైనా గుండె గుభేల్మనడం ఖాయం. ఆ బైక్‌పై ముగ్గురు మహిళలు కూర్చోగా.. వారి చేతుల్లో ఒడిలో కలిపి మొత్తం ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఇక వీరందరినీ ఎక్కించుకున్న ఆ బైక్ డ్రైవర్.. కూర్చోవడానికి సీటుపై స్థలం లేకపోవడంతో ఏకంగా ఫ్యూయల్ ట్యాంక్ పెట్రోల్ ట్యాంక్ పై కూర్చొని వాహనాన్ని నడపడం ఇక్కడ విశేషం. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సాగిస్తున్న ఈ ప్రమాదకర ప్రయాణం చూసి నెటిజన్లు షాక్‌కు గురవుతున్నారు.

**అక్కడి వ్యవస్థకు నిదర్శనం..**

పాకిస్థాన్‌లో ఇలాంటి దృశ్యాలు కనిపించడం ఇదే మొదటిసారి కాదు. అక్కడ ట్రాఫిక్ నిబంధనలు, రోడ్ల భద్రత ఎంత దారుణంగా ఉన్నాయో చెప్పడానికి ఈ ఘటనే ఒక ఉదాహరణ. కరాచీ, ఇస్లామాబాద్, పెషావర్ వంటి కొన్ని ప్రధాన నగరాలను మినహాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో మౌలిక వసతులు శూన్యం. రోడ్లు గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే ఉండడు. అక్కడి పాలకులు ప్రజలపై ఈస్ట్ ఇండియా కంపెనీ తరహాలో భారీగా పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ అభివృద్ధి మాత్రం అంజనం వేసి వెతికినా కనిపించదు. ఒకే బైక్‌పై నలుగురు ఐదుగురు వెళ్లడం అక్కడ సర్వసాధారణం అయిపోయింది.

**నెటిజన్ల ఆగ్రహం**

"ఇది ప్రయాణమా.. లేక మృత్యువుతో ఆటలా?" అంటూ నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. చిన్న పిల్లలను పెట్టుకుని అంతమంది ఒకే బైక్‌పై వెళ్లడం వల్ల ఏ చిన్న ప్రమాదం జరిగినా ఎంత నష్టం జరుగుతుందో ఊహించడానికే భయంగా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ "పది మంది ప్రయాణం" వీడియో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతంగా షేర్ అవుతూ పాకిస్థాన్ పాలనా వ్యవస్థపై మరోసారి చర్చకు దారితీస్తోంది.

# ఎంపీలకు చింత.. ఏపీలో పొలిటికల్ ఫీవర్!

ఏపీలో పొలిటికల్ ఫీవర్ కనిపిస్తోంది. వాస్తవానికి ఎన్నికలకు మూడు సంవత్సరాల సమయం ఉన్నా.. ఇప్పటి నుంచే ఎంపీలు తమ తమ భవిష్యత్తుపై బెంగ పెట్టుకున్నట్టు కనిపిస్తోంది. వారిపై వస్తున్న ఆరోపణలు ఒక వైపు ప్రశ్నలుగా మారుతుండగా.. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఎంపీలు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం తాము ఉన్న నియోజకవర్గాలు అలానే ఉండే పరిస్థితి లేదు. వచ్చే వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ఆమోదించేందుకు మోడీ సర్కారు రెడీ అయింది.

దీంతో తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల బౌండరీలు మారుతాయని భావిస్తున్న ఎంపీలు.. నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధిపనులను కూడా లైట్ తీసుకుంటున్నారు. ఎవరికి వారు... మొక్కుబడిగానే వ్యవహరిస్తున్నారు. ఈ విషయం సీఎం చంద్రబాబు వరకు వెళ్లింది. దీనిపై కుప్పం పర్యటనలోనే చంద్రబాబు హెచ్చరికలు చేశారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహించకపోవడం.. ప్రజలను కలుసుకోకపోవడంపై ప్రశ్నించారు. అంతేకాదు.. పరిస్థితులు ఎలా ఉన్నా.. ముందు ప్రజలను కలుసుకోవాలని సూచించారు. అయితే.. మెజారిటీ ఎంపీల నుంచి సరైన సమాధానం రాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విజయవాడ సహా కీలక నియోజకవర్గాల్లో ఎంపీలపై వస్తున్న ఆరోపణలు ఒకవైపు చర్చకు దారితీస్తుండగా.. మరో వైపు.. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై నాయకులు బెంగ పెట్టుకున్నారని.. ఇప్పుడు తాము ఇంత యాక్టివ్‌గా తిరిగినా.. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాల్లో మార్పులు జరిగితే.. తమ కష్టం వృథా అవు తుందన్న ఆలోచనలో ఉన్నారు. దీంతో నాయకులకు–ప్రజలకు మధ్య గ్యాప్ కూడా పెరిగింది.

**తర్వాత చూద్దాం..**

ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. ముందు ప్రజల మధ్య ఉండాలని ఎంపీలకు సూచించారు. నియోజకవర్గాల పునర్విభజనతో ఎవరికీ ఎలాంటి నష్టం ఉండదని చెప్పారు. పార్టీ పరంగా కార్యక్ర మాలకు హాజరై.. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా.. పార్టీ బలోపేతం అవుతుందని.. తద్వారా నియోజ కవర్గాల పెంపు జరిగినా.. నాయకులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ఆయన దిశానిర్దేశం చేశారు. త్వరలోనే ఎంపీల పనితీరుపై నివేదిక ఇవ్వనున్నట్టు సీఎం చంద్రబాబు చెప్పినట్టు సీనియర్ నేతలు చెబుతున్నార.

# వైసీపీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు ఔట్!




ఏపీ ప్రతిపక్షం వైసీపీకి అసెంబ్లీలో సంఖ్యా బలం లేదు. 2024లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఆ పార్టీ 11 స్థానాలకే పరిమితం అయింది. దీంతో శాసన మండలిలోనే ఇప్పటి వరకు వైసీపీబలంగా పోరాడుతోంది. అయితే.. కొందరు ఎమ్మెల్సీలు ఇప్పటికే రాజీనామా చేసి బయటకు వచ్చేయగా.. ఇప్పుడు మరో ఇద్దరు ఎమ్మెల్సీల పదవీ కాలం కూడా పూర్తికానుంది. దీంతో ఆ ఇద్దరు ఎమ్మెల్సీలు వైసీపీకి దూరం కానున్నారు. వారే.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు. కర్నూలుకు చెందిన శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖానుం. వీరిద్దరి పదవీ కాలం ఈ నెల 28తో ముగియనుంది. దీంతో త్వరలోనే మండలి సభ్యుల కోసం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని.. అధికారులు తెలిపారు. ప్రస్తుతం వివరాలను కేంద్ర ఎన్నిక లసంఘానికి పంపించినట్టు రాష్ట్ర ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

**కూటమికే!**

వైసీపీ నుంచి విరమణ పొందుతున్న ఇద్దరు అభ్యర్థులు తప్పుకొంటే.. ఆ రెండు పదవులు సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న టీడీపీ నేతృత్వంలోని కూటమికే దక్కనున్నాయి. దీంతో బీజేపీ, జనసేన, టీడీపీలే ఈ రెండు పదవులను దక్కించుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈ రెండు స్థానాల్లో రెండు కూడా టీడీపీనే తీసుకునే ఆలోచనలో ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ, జనసేనలకు ఇప్పటికే అవకాశం ఇచ్చిన దరిమిలా.. త్వరలోనే ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులే ఉంటారని అంటున్నారు.

**తెరమీదికి చాలా మంది..**

ఈ నేపథ్యంలో తెరమీదికి చాలా మంది పేర్లు వినిపిస్తున్నాయి. పిఠాపురం టికెట్‌ను త్యాగం చేసిన వర్మ, మైలవరం టికెట్‌ను త్యాగం చేసిన దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రస్తుతం కడప ఎమ్మెల్యేగా ఉన్న మాధవీరెడ్డి భర్త.. శ్రీనివాసరెడ్డి పేర్లు ముందు వరుసలో ఉన్నాయి. ఇక, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వర్ల రామయ్య పేరు కూడా జోరుగా వినిపిస్తోంది. ఇదేసమయంలో బీసీలకు అవకాశం ఇవ్వడంతోపాటు.. మహిళలకు అవకాశం ఇవ్వాలని.. అదేసమయంలో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్న నేపథ్యంలో ఈ కోటాల నుంచి కూడా పదుల సంఖ్యలో పేర్లు వెలుగు చూస్తున్నాయి.

# నడిచొచ్చిన దేవుడు: పొంగిపోయిన చంద్రబాబు అభిమాని




ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబును చూసేందుకు మాత్రమే కాదు.. ఆయనను తమ ఇంటికి ఆహ్వానిస్తున్న అభిమానులు కోకొల్లలుగా ఉంటున్నారు. ఇటీవల కోనసీమ పర్యటనకు వెళ్లినప్పుడు 86 ఏళ్ల వృద్ధుడు చంద్రబాబును చూడాలని ఉందని కోరడం.. ఆయనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం తెలిసిందే. దీంతో సీఎం స్వయంగా ఆయనకు ఫోన్ చేసి.. –వస్తున్నా.. సత్యనారాయణ. రేపు మనం కలుద్దాం అంటూ మాట్లాడారు. తర్వాత రోజు పర్యటనలో సత్యనారాయణను ప్రత్యేకంగా పిలిపించుకుని అభిమాని కోరిక తీర్చారు. ఆయనకు సొంతిల్లు నిర్మించి ఇవ్వడంతోపాటు.. స్థానికంగా అభివృద్ధి కి కూడా హామీ ఇచ్చారు. తాజాగా సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలోనూ ఇలాంటి ఘటనే జరిగింది. కుప్పం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, సీఎం చంద్రబాబు అంటే ప్రాణం పెట్టే చెంగాచారి ఇంటికి ముఖ్యమంత్రి వెళ్లారు. కడపల్లిలోని తన నివాసం నుంచి కుప్పం వెళ్తున్న సమయంలో చెంగాచారి కోరిక మేరకు శాంతిపురంలోని ఆయన ఇంటికి వెళ్లారు. చెంగాచారి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించిన సీఎం...వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంగాచారి సతీమణి చేసిన అల్పాహారాన్ని రుచి చూశారు. వారి ఇంటికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎవరీ చంగాచారి? కుప్పం నియోజకవర్గంలోని కీలకమైన శాంతిపురం మండలంలో టీడీపీకి అనుకూలంగా 99 శాతం మంది ఉన్నారు. ఈ మండలం అత్యంత కీలకం. అయితే.. ఇక్కడి పార్టీ నాయకులు,

కార్యకర్తలను కాపాడుకోవడంతోపాటు ఇంటింటికీ ప్రభుత్వ సంక్షే పథకాలను ప్రచారం చేయడంలోనూ చంగాచారి కీలకరోల్ పోషిస్తున్నారు.

వైసీపీ హయాంలో శాంతిపురం మండలంలో ఓట్లు చీల్చే ప్రయత్నం చేసినప్పుడు.. ధర్నాలు, నిరసనలకు దిగి.. పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచారు. అన్నగారి హయాం నుంచి టీడీపీలోనే ఉన్న చంగాచారి.. చంద్రబాబు అంటే ప్రాణం పెడతారు. ఆయన గెలుపు కోసం.. అహరహం శ్రమిస్తారని స్థానికులు చెబుతారు. దేవుడు నడిచొచ్చాడు! చంద్రబాబు తన ఇంటికి రావడం పట్ల చంగాచారి, ఆయన ఫ్యామిలీ సంతోషం వ్యక్తం చేసింది. దేవుడు నడిచి వచ్చాడంటూ.. చంగాచారి కుటుంబం పేర్కొనడం గమనార్హం. ఇటీవల కాలంలో చంద్రబాబు మాస్ సహా.. పార్టీలో కీలక కార్యకర్తలు, నాయకులకు అత్యంత చేరువ అవుతున్నారు.

ఈ క్రమంలో ఎక్కడ ఏ చిన్న అవకాశం వచ్చినా ఆయన అస్సలు మిస్ కాకుండా పార్టీ నేతలను సంతోష పరచే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఒకవైపు పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా బిజీగా ఉన్నప్పటికీ.. మరోవైపు అభిమానులను కూడా అంతే దృష్టితో చూస్తున్నారనడానికి చంగాచారి కుటుంబానికి దక్కిన పరామర్శే ఉదాహరణ.

# మీ ఫ్రెండ్‌షిప్‌కు థాంక్యూ ఇండియా.. భారత ప్రతినిధులకు ఇరాన్ కృతజ్ఞతలు



భారత్ – ఇరాన్ దేశాల మధ్య ఉన్న సుదీర్ఘమైన, చారిత్రాత్మకమైన స్నేహబంధాన్ని మరోసారి గుర్తు చేసే ఒక ముఖ్యమైన పరిణామం అంతర్జాతీయ వేదికపై చోటుచేసుకుంది. ఇరాన్ మాజీ సుప్రీం నేత అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత అధికారిక ప్రతినిధులు.. ప్రముఖులు హాజరైన నేపథ్యంలో న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం (ఎంబసీ) భారత ప్రభుత్వానికి, భారత ప్రజలకు తమ హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేసింది. ఈ మేరకు ఇరాన్ ఎంబసీ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేకమైన, భావోద్వేగ సందేశాన్ని విడుదల చేసింది.

ఇరాన్ ఎంబసీ తన సందేశంలో "ఈ అత్యంత క్లిష్ట సమయంలో మాకు అండగా నిలిచిన భారత ప్రభుత్వం, భారత ప్రజలకు మా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ విపత్కర పరిస్థితుల్లో మీరు చూపిన సానుభూతి, మద్దతును ఇరాన్ ప్రజలు ఎప్పటికీ మరచిపోరు. ఇది ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న బలమైన స్నేహం, పరస్పర గౌరవానికి అద్దం పడుతోంది" అని పేర్కొంది. అలాగే భారత్–ఇరాన్ మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక, దౌత్య సంబంధాలు ఈ పరిణామంతో మరింత బలోపేతమవుతున్నాయని వెల్లడించింది.

**ఘనంగా నివాళులర్పించిన భారత ప్రతినిధి బృందం**

ఇరాన్ మాజీ సుప్రీం నేత అలీ ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు శుక్రవారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో అత్యంత అధికారిక లాంఛనాలతో ప్రారంభమయ్యాయి. ఆయన భౌతికకాయాన్ని రాజధానిలోని ప్రసిద్ధ గ్రాండ్ మొసల్లా మసీదులో ప్రముఖులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు, ఉన్నతాధికారులు, మతపెద్దలు ఆయనకు ఘన నివాళులర్పించారు. వేలాది మంది స్థానిక ప్రజలు కూడా తమ ప్రియతమ నేతకు అంతిమ వీడ్కోలు పలికేందుకు అక్కడికి తరలివచ్చారు. భారతదేశం తరఫున ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈ కార్యక్రమానికి హాజరైంది. ఇందులో బిహార్ గవర్నర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా, ప్రముఖ మాజీ సైనిక అధికారి సయ్యద్ అతా హస్నైన్ పాల్గొని భారత ప్రభుత్వ అధికారిక ప్రతినిధులుగా నివాళులర్పించారు. వీరితో పాటు భారత రాజకీయ రంగం నుండి కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ కూడా ఈ అంత్యక్రియల కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

**భారతీయ మత సామరస్యానికి ప్రతీక**

ఈ పర్యటనలో అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే.. భారత ప్రతినిధి బృందంలో కేవలం రాజకీయ, దౌత్య ప్రముఖులే కాకుండా భారతదేశంలోని వివిధ ప్రధాన మతాలకు చెందిన ప్రముఖ మత పెద్దలు కూడా భాగమయ్యారు. సిక్కు, హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన గురువులు ఒకే వేదికపై ఇరాన్ నేతకు నివాళు లర్పించడం అంతర్జాతీయంగా అందరి దృష్టిని ఆకర్షించింది. ఇది భారతదేశం యొక్క గొప్ప సంస్కృతి అయిన మత సామరస్యాన్ని, అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అనుసరిస్తున్న సమతుల్య విధానాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**మషహద్‌లో తుది అంత్యక్రియలు**

ప్రస్తుతం టెహ్రాన్‌లో ఉన్న అలీ ఖమేనీ పార్థివ దేహాన్ని త్వరలోనే ఆయన స్వస్థలమైన మషహద్‌కు తరలించనున్నారు. అక్కడ ఈ నెల 9వ తేదీన పూర్తి అధికారిక, సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేయనున్నట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ప్రపంచంలోని పలు దేశాల అగ్రనేతలు, ప్రతినిధులు ఈ ముగింపు కార్యక్రమానికి కూడా హాజరవుతుండటంతో అంతర్జాతీయ స్థాయిలో ఈ అంత్యక్రియలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది.

**బలోపేతం కానున్న ద్వైపాక్షిక సంబంధాలు**

భారతదేశం చూపిన ఈ సానుభూతికి ఇరాన్ ప్రభుత్వం వ్యక్తం చేసిన కృతజ్ఞతలు ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక, దౌత్య సంబంధాలకు ఒక కొత్త మైలురాయిగా నిలిచాయి. కేవలం కష్టకాలంలోనే కాకుండా, భవిష్యత్తులో కూడా వ్యాపార, వ్యూహాత్మక రంగాలలో ఈ అనుబంధం మరింత బలపడుతుందనే గట్టి ఆశాభావాన్ని ఇరు దేశాల దౌత్య వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

## సంపాదకీయం

ఖమేనీ మరణించి, 1989 నుంచి పాలించిన ఆయన స్థానంలో వచ్చిన నాయకత్వాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇరాన్ ప్రభుత్వం జూలై 4 నుంచి 9 వరకూ బహుళ దినాల అంత్యక్రియలను నిర్వహిస్తోంది. తెహ్రాన్, ఖోమ్, మషాద్‌లతోపాటు ఇరాక్‌లోని నజఫ్, కర్బలాల మధ్య విస్తరించిన ఈ కార్యక్రమాలకు తెహ్రాన్ ఒక్కదానిలోనే 1.5–2 కోట్లమంది హాజరవుతారని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ జనసందోహాన్ని ప్రదర్శించడం ద్వారా, తమ నాయకుడి హత్యకు కారకులైన శక్తులకే తమ పాలనా వ్యవస్థ మనుగడను చాటిచెప్పాలన్నది ఇరాన్ వ్యూహంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో హర్మూజ్ జలసంధిపై తన పట్టును సంధాన సాధనంగా ఉపయోగించుకునేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోంది.

ఖతార్ మధ్యవర్తిత్వంలో పరోక్ష చర్చలు "సానుకూల పురోగతి" సాధిస్తున్నా, ఖమేనీ అంత్యక్రియల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఇరాన్‌లో అయతొల్లాల కంటే ఇప్పటికే పైచేయి సాధిస్తున్న ఐఆర్‌జీసీ, కొత్త నాయకుడితో మరింత నిర్భయంగా వ్యవహరించే అవకాశముంది. దీని ప్రభావం భారత్ సహా అధిక షియా జనాభా ఉన్న దేశాల్లోనూ షియా–సున్నీ ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే ప్రమాదముంది. ఇజ్రాయెల్ సైతం "గాయపడిన పులిలా" వ్యవహరించే అవకాశం ఉంది. అమెరికాతో బంధం సన్నగిల్లుతున్న సూచనలతో, ఇజ్రాయెల్ అరబ్ పొరుగు దేశాలతో కొత్త "సాహసోపేత" చర్యలకు దిగే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా. ఇది అబ్రహామ్ ఒప్పందాల నుంచి ఏర్పడిన బలహీన శాంతిని మరింత దెబ్బతీయవచ్చు. అమెరికా ప్రభావం క్షీణించనుండటంతో, గల్ఫ్ దేశాలు తమ భద్రత కోసం అమెరికాపై ఆధారపడటాన్ని పునఃసమీక్షించుకునే అవకాశం ఉంది; పశ్చిమాసియాలో అమెరికా సైనిక ఉనికిని తగ్గించాలన్న డిమాండ్లు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రష్యా, చైనాలు ఈ సంఘర్షణ నుంచి పెద్దగా ప్రయోజనం పొందలేదు గానీ, ఈ స్థాయి అనిశ్చితి అల్‌ఖైదా వంటి తీవ్రవాద సంస్థల పునరుజ్జీవానికి దోహదపడే ప్రమాదం ఉందని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పెద్దన్న పట్టుజారుతోందా?

రెండో ప్రపంచ యుద్ధం ముగిసినప్పటి నుంచి అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల ఆధిపత్యం ప్రపంచ వ్యవహారాల్లో అత్యంత సహజ సత్యంగా చలామణి అవుతూ వచ్చింది. సైనిక శక్తి, సాంకేతిక ఆవిష్కరణలు, ఆర్థిక పటిష్టతల ఆధారంగా ఏర్పడిన ఆధిపత్యం దశాబ్దాలుగా సవాలు లేకుండా సాగుతోంది. అయితే చైనా ఎదుగుదల, కీలక వ్యూహాత్మక వనరులపై దాని పట్టు, మధ్యస్థాయి శక్తుల ప్రాబల్యం క్రమంగా అమెరికా అగ్రరాజ్య ప్రతిష్టను దెబ్బతీయడం మొదలుపెట్టాయి. పశ్చిమ నాయకత్వానికి సమర్థవంతమైన సవాలు ఎదురుకావడానికి ఇంకా సమయం ఉందని చాలామంది నిపుణులు నమ్మారు. అమెరికా నిర్మాణాత్మక బలహీనతలపై ఆందోళనలు పెరుగుతున్నా, ఇరాన్‌వంటి దేశం అమెరికా ప్రతిష్టకు ఇంతటి తీవ్ర, ప్రాణాంతక దెబ్బ తగిలిస్తుందని ఎవరూ ఊహించలేదు. మృతిచెందిన ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ ఒకసారి అమెరికన్లు నిరంతరం యుద్ధ బెదిరింపులు చేస్తారుగానీ.. వారికి "నిలబడే శక్తి" ఉండదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆ మాటలు యథార్థమేనని రుజువవుతోంది. 1980–88నాటి ఇరాన్–ఇరాక్ యుద్ధ కాలంలో ఇరాన్ ఇస్లామిక్ పాలనా వ్యవస్థ ప్రదర్శించిన అసాధారణ సహనం, తట్టుకునే శక్తి, తన పాలనను కాపాడుకోవాలన్న పట్టుదల– ఇప్పటికీ కొనసాగుతోందని ఇటీవలి పరిణామాలు చాటిచెప్పాయి. ఈ కోణాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్తించకపోవడం.. భారీ మూల్యం చెల్లించేలా చేసింది. స్విట్జర్లాండ్‌లో అన్ని వివాదాస్పద అంశాలపై సమగ్ర చర్చలు మొదలుపెట్టకముందే, యుద్ధాన్ని ముగించి హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు అమెరికా, ఇరాన్ గడచిన జూన్ మధ్యలో ఒక "ప్రాథమిక ఒప్పందా"నికి వచ్చాయి. అధికారిక చర్చలకు ముందు, జూన్ 17న ఫ్రాన్స్‌లోని వర్సైల్స్ రాజప్రాసాదంలో ట్రంప్ సంతకం చేసిన 14 అంశాల అవగాహన ఒప్పందం (ఎంవోయూ), మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీపై అవమానకరమైన షరతులు విధించిన 1919 నాటి వర్సైల్స్ ఒప్పందంతో పోలికలకు దారితీసింది. ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ దాడులకు ముందున్న యథాతథ స్థితినే ఈ ఒప్పందం తిరిగి ధ్రువీకరిస్తోందని విస్తృత విమర్శలు వచ్చాయి. హర్మూజ్ జలసంధి పునఃప్రారంభం, అమెరికా దిగ్బంధనం ఎత్తివేత, ఇరాన్ పునర్నిర్మాణం కోసం కనీసం 300 బిలియన్ డాలర్ల ప్రణాళికకు అస్పష్ట కట్టుబాటు వంటివి ఇందులో ఉన్నాయి. అయితే అమెరికా నిధులు నేరుగా ఇరాన్‌కు వెళ్లబోవని అమెరికా స్పష్టం చేసింది కాబట్టి, ఈ కట్టుబాటు స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదలకే పరిమితమయ్యే అవకాశం ఉంది. అణ్వాయుధం అభివృద్ధి చేయబోమన్న ఇరాన్ హామీ కూడా ఇందులో ఉన్నట్టు తెలుస్తోంది. స్విట్జర్లాండ్ చర్చలు లాంఛనప్రాయంగానే ముగిశాయని, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ) తనిఖీ బృందాలను తిరిగి అనుమతించేలా తెహ్రాన్‌ను ఒప్పించి తాము కీలక మైలురాయిని సాధించామని అమెరికా ప్రకటించింది. అయితే అణు తనిఖీలపై తాము "కొత్త కట్టుబాట్లేవీ" చేయలేదని ఇరాన్ తన రాజ్య మీడియాకు తెలిపింది. ఈ ముగింపు అమెరికాకు "తీవ్రంగా అవసరమైన కాల్పుల విరమణ"గా చాలామంది పరిశీలకులు అభివర్ణించారు. ఎందుకంటే వెంటనే అమెరికా ఇరాన్‌పై చమురు ఆంక్షలు ఎత్తివేసి, 60 రోజుల మినహాయింపు జారీ చేసింది. ప్రపంచవ్యాప్తంగా వార్తాపత్రికలు ఈ ఒప్పందంపై కాకుండా, అమెరికా ప్రతిష్టకు వాటిల్లిన నష్ట తీవ్రతపైనే ఎక్కువగా దృష్టి పెట్టాయి. "వర్సైల్స్–2: చరిత్రకారులు సైతం అడుగుపెట్టేందుకు జంకేచోట ట్రంప్ చొరవ" అంటూ ఒక ప్రముఖ పత్రిక వేసిన శీర్షిక దీనికి అద్దం పడుతుంది. వాస్తవానికి ఈ ఒప్పందంవల్ల అమెరికాకు గణనీయమైన ప్రయోజనమేమీ దక్కలేదు. చమురు ఆంక్షల సడలింపు, హర్మూజ్ జలసంధి రవాణా వ్యవహారాల్లో ఇరాన్‌కు అధికారిక పాత్ర, భవిష్యత్‌లో రవాణా రుసుములు వసూలు చేసే అవకాశం వంటివి ఒప్పందంలో భాగంగా ఉన్నాయి. అయితే నౌకల భద్రత, రక్షణ చర్యలు, అత్యవసర సహాయ వ్యవస్థలపై ఇప్పటికీ స్పష్టత లేదు. ప్రపంచంలోనే అగ్రగామి అణుశక్తి అయిన అమెరికా, యుద్ధంలో బాగా దెబ్బతిన్న ఇరాన్‌కు తలవంచిన వైనమే పెద్ద చర్చకు దారితీసింది. ఇరాన్‌ను నిర్వీర్యం చేసి, పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ నిర్వివాద ఆధిపత్యాన్ని స్థాపించాలన్న ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కుటిల వ్యూహం ఇప్పుడు చరిత్రలో అవశేషమైంది.

### పనికొచ్చే పలుకు



## ఏది నాటితే.. అదే మొలుస్తుంది!

"మీరు మనసులో ఏది నింపితే, అదే మీకు ఖచ్చితంగా తిరిగి వస్తుంది" అంటాడు ప్రసిద్ధ రచయిత జేమ్స్ జాయిస్. మన ఆలోచనల్లో సానుకూలత, జ్ఞానం, స్పష్టమైన లక్ష్యాలను నింపుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం, పట్టుదల, విజయాన్ని సొంతం చేసుకోవచ్చున్నది ఆయన మాటల్లోని అనుభవపూర్వక పాఠం. క్రమశిక్షణ, ఆశాజనకమైన ఆలోచనా విధానమే వ్యక్తిగత ఎదుగుదలకు, విజయానికి బలమైన పునాదిగా మారుతుంది. ఒక అద్దం మనం చూపే భావాన్నే ప్రతిబింబిస్తుంది. మానవ మేధస్సు కూడా అంతే. దానికి మనం నిరంతరం అందించే సమాచారాన్నే అది తిరిగి ప్రతిఫలిస్తుంది. సవాళ్లు ఎదురైనప్పటికీ ఆశావాదం, నిరంతర అభ్యాసం, స్వీయ క్రమశిక్షణను ఎంచుకోవడం ద్వారా సంతృప్తికరమైన జీవితాన్ని నిర్మించుకోవచ్చు. సానుకూల ఆలోచనలు, నిరంతర అభ్యాసం మన వ్యక్తిత్వాన్ని, నిర్ణయాలను, భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. అదే సమయంలో ప్రతికూల ఆలోచనలు మనకు అడ్డంకులను, పరిమితులను సృష్టిస్తాయి.

మన మనసు ఒక ప్రవహించే నదిలాంటిదని ఈ సూక్తి మనకు నేర్పుతుంది. ఆ నదిలో మనం ఏ నీటిని కలిపితే, అదే రంగులో అది ముందుకు సాగుతుంది. భయం, ప్రతికూలత, కోపం, లేదా ఆత్మన్యూనతా భావాలను మనసులో నింపితే, అవి మన భావోద్వేగాలను, పనులను శాసిస్తాయి. మరోవైపు సానుకూల ఆలోచనలు, ఉపయోగకరమైన జ్ఞానం, సృజనాత్మకత, ఆశావహ దృక్పథాన్ని మనసుకు అందిస్తే, మనం మరింత ఆత్మవిశ్వాసంతో క్లిష్ట పరిస్థితులను సైతం అధిగమించగలుగుతాం. మన మానసిక అలవాట్లకు మనమే బాధ్యత వహించాలని ఈ మాటల పాఠం. ఎందుకంటే విజయం, సంతోషం అనేవి మన ఆలోచనా విధానం నుంచే మొదలవుతాయి. మనం చదివే ప్రతి పుస్తకం, మనం జరిపే ప్రతి సంభాషణ, మనలో మెదిలే ప్రతి ఆలోచన మన వ్యక్తిత్వ రూపాంతరానికి దోహదం చేస్తాయి.

నిత్య జీవితంలో దీని ప్రాధాన్యత

నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ తమ ఆలోచనల ప్రభావాన్ని అనుభవిస్తూనే ఉంటారు. తమపై నమ్మకం ఉన్న విద్యార్థులు మరింత ఆత్మవిశ్వాసంతో చదువుతారు. ఉద్యోగులు సానుకూల వైఖరితో మెరుగ్గా రాణిస్తారు. కష్టాల్లో ఉన్నవారు ఆశావహ దృక్పథంతో మరింత బలంగా తయారవుతారు. ప్రస్తుత సోషల్ మీడియా యుగంలో సమాచారం విపరీతంగా అందుబాటులో ఉంటోంది. ఇలాంటి సమయంలో మన మనసులోకి ఎలాంటి విషయాలను రానివ్వాలో జాగ్రత్తగా ఎంచుకోవాలని ఈ సూక్తి గుర్తుచేస్తుంది. ప్రతికూల ఆలోచనల స్థానంలో ఆశావాదాన్ని, నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకోవడం వల్ల ఏ వయసు వారైనా, ఏ వృత్తిలో ఉన్నవారైనా ప్రయోజనం పొందుతారు.

అందుకే స్ఫూర్తినిచ్చే పుస్తకాలు చదవాలి. కొత్త నైపుణ్యాలు సాధన చేయాలి. మనకు మద్దతుగా నిలిచే వ్యక్తులతోనే సమయం గడపాలి. సమస్యలపైనే దృష్టి పెట్టకుండా, ఉన్నదానిని అభినందిస్తూ కృతజ్ఞతా భావాన్ని అలవర్చుకోవాలి. మనల్ని మనం తక్కువ చేసుకునే ఆలోచనల స్థానంలో ప్రోత్సహించే ఆలోచనలను పెంచుకోవాలి. జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. నిత్యం ధ్యానం లేదా ఆత్మపరిశీలన చేసుకోవడం ద్వారా నిరంతర అభ్యాసాన్ని కొనసాగించాలి.

# కృత్రిమ బుడగ పేలిపోతే..?

ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ దిగ్గజాలు కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాల కోసం కుమ్మరిస్తున్న పెట్టుబడులు ఇప్పుడు చరిత్రలోనే అత్యంత భారీస్థాయికి చేరుకున్నాయి. గత ఏడాది సుమారు 400 బిలియన్ డాలర్లుగా ఉన్న బడా టెక్ కంపెనీల ఏఐ మూలధన వ్యయం.. ఈ ఏడాది 700 బిలియన్ డాలర్లను దాటనుంది. మైక్రోసాఫ్ట్, మెటా, గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్, అమెజాన్, ఒరాకిల్ వంటి కంపెనీలు కలిసి 2025లో సుమారు 365 బిలియన్ డాలర్లనుంచి 2026లో దాదాపు రెట్టింపుస్థాయికి తమ ఏఐ వ్యయాలను పెంచుకున్నాయి. అమెజాన్ ఒక్కటే 200 బిలియన్ డాలర్లు వెచ్చించనుండగా, ఆల్ఫాబెట్ తన అంచనాను 90 బిలియన్ల నుంచి ఏకంగా 175–185 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేసింది. మెటా సైతం తన మూలధన వ్యయ లక్ష్యాన్ని 135 బిలియన్ డాలర్ల వరకూ పెంచుకుంది. ఈ గణాంకాలు కొన్ని దేశాల మొత్తం జీడీపీని మించిపోతుండటం గమనార్హం. కానీ ఇంత భారీ వ్యయానికి తగ్గ ఆదాయం ఏఐ కంపెనీలకు ఇంకా అందడం లేదన్నది నిపుణుల ఆందోళన. ఖర్చులు పెరిగే కొద్దీ నగదు నిల్వలపై ఒత్తిడి తీవ్రమవుతోంది. మెటావంటి కంపెనీల విషయంలో వచ్చే రెండేళ్లలో నికర నగదు ప్రవాహం రుణాత్మకంగా మారే అవకాశముందని విశ్లేషకుల అంచనా. దీన్నిబట్టి, ఏఐ రంగంలో పెట్టుబడుల విస్ఫోటనం నిజంగా సాంకేతిక విప్లవానికి నాంది కాదా? లేక చరిత్రలోనే అతిపెద్ద మూలధన దుర్వినియోగమా? అన్న ప్రశ్న తెరమీదకు వస్తోంది. న్యూయార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గ్యారీ మార్కస్ వంటి నిపుణులు దీన్ని "చరిత్రలోనే అతిపెద్ద మూలధన దుర్వినియోగం"గా అభివర్ణించడం ఈ చర్చకు మరింత బలం చేకూరుస్తోంది.

ఈ నేపథ్యంలో సాంకేతిక విమర్శకుడు, రచయిత కోరీ డాక్టరో కొత్తగా వెలువరించిన "ది రివర్స్ సెంటార్స్ గైడ్ టు లైఫ్ ఆఫ్టర్ ఏఐ" పుస్తకం విస్తృత చర్చకు తెరలేపింది. గత ఏడాది ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగదారుల అనుభవం ఎందుకు దిగజారుతోందో విశ్లేషిస్తూ ఆయన రాసిన "ఎన్‌షిటిఫికేషన్" పుస్తకం పెద్ద సంచలనమే సృష్టించింది. ఆటోమేషన్ సిద్ధాంతంలో "సెంటార్" అంటే యంత్రం సాయంతో మరింత సమర్థంగా పనిచేయగలిగే మనిషి. అంటే కంప్యూటర్ వాడే ప్రతి ఒక్కరూ ఒకవిధంగా సెంటార్లే. అయితే "రివర్స్ సెంటార్" అంటే దీనికి పూర్తి భిన్నం. యంత్రానికి సహాయకుడిగా మారిన మనిషి. చిత్రాలు, పాఠ్యాంశాలను గుర్తించి ఏఐ నమూనాలకు శిక్షణనిచ్చే తక్కువ వేతనాల కార్మికుల నుంచి మొదలుకుని, భవిష్యత్తులో యాజమాన్యాలు తమ సిబ్బందిని తగ్గించుకుని, కేవలం కొద్దిమంది సాయంతో ఏఐ చేత మెజారిటీ పని చేయించుకోవాలని కోరుకోవడం వరకూ– ఇవన్నీ రివర్స్ సెంటార్ల ఉదాహరణలేనని నిపుణులు అంటున్నారు. అసలు ఏఐ రంగంలో పెట్టుబడిదారులు ఇంతగా డబ్బు కుమ్మరించడానికి కారణం కూడా ఇదేనని, "యజమానులు తమ సగం సిబ్బందిని తొలగించి, ఆ మిగిలిన లాభాలను ఏఐ కంపెనీలు, వినియోగదారుల మధ్య పంచుకోగలిగే స్థాయికి ఏఐ అభివృద్ధి చెందుతుంది" అన్న ఆశతోనే వారు పెట్టుబడులు పెడుతున్నారని నిపుణుల లెక్క. అందుకే ఏఐ పోటీ ఒక సాధారణ రేసు కాదు, ఇదొక "మరణ యుద్ధం"గా మారిందని, చివరికి ఒకే సంస్థ గుత్తాధిపత్యం సాధించే అవకాశముందని పరిశ్రమ వర్గాల అంచనా. అయితే ఏ కంపెనీ చివరకు అగ్రస్థానంలో నిలుస్తుందన్న దానిపై స్పష్టత లేకపోవడంతో, ప్రతి పెట్టుబడిదారుడూ తానే సరైన అంచనా వేశానని భావిస్తూ పోటీలో కొనసాగుతున్నారు. పెట్టుబడిదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం కంపెనీలు మరింత శక్తిమంతమైన ఏఐ నమూనాలను నిరంతరం ఆవిష్కరించాల్సి వస్తోంది. ఫలితంగా భారీ విద్యుత్, నీటి వినియోగంతో కూడిన డేటా సెంటర్ల నిర్మాణం విచక్షణారహితంగా కొనసాగుతూ, పర్యావరణంపై, స్థానిక సమాజాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పర్యావరణ, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.



> కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడుల వరద పోటెత్తుతోంది. బడా టెక్ కంపెనీల మూలధన వ్యయం ఈ ఏడాది 700 బిలియన్ డాలర్లు దాటనుంది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు స్థాయి. అయినా ఖర్చులకు తగ్గ ఆదాయం ఇంకా అందని పరిస్థితి. నిపుణులు దీన్ని "చరిత్రలోనే అతిపెద్ద మూలధన దుర్వినియోగం"గా అభివర్ణిస్తున్నారు. యజమానులు సిబ్బందిని తగ్గించి ఏఐతో పని చేయించుకోవాలన్న ఆశే ఈ పెట్టుబడుల వెనుక అసలు కారణం. బుడగ పేలితే సామాన్యులు, పింఛనుదారులపైనే భారీ ప్రభావం పడే ప్రమాదం ఉంది.

ఏఐ ఆర్థిక నమూనాలో ఉన్న ప్రాథమిక లోపమే ఈ బుడగ చివరికి పేలిపోవడానికి కారణమవుతుందని నిపుణుల లెక్కగడుతున్నారు. గతంలో డాట్‌కామ్ బుడగ పేలకముందు, ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య పెరిగే కొద్దీ ఒక్కో వినియోగదారుడిని జోడించే వ్యయం, ఒక్కో సెషన్ ఖర్చు క్రమంగా తగ్గుతూ వచ్చింది. కానీ ఏఐ విషయంలో పరిస్థితి పూర్తి భిన్నం. ప్రతి కొత్తతరం ఏఐ నమూనాను శిక్షణ ఇవ్వడానికి, నిర్వహించడానికి అంతకుముందు కంటే మరింత ఖర్చవుతోంది. కొత్త వినియోగదారుడిని లేదా కొత్త ఫీచర్‌ను జోడించే కొద్దీ ఖర్చు తగ్గకపోగా పెరుగుతూనే ఉంటుందని విశ్లేషకుల మదింపు. ఈ పరిస్థితుల్లో ఏఐ కంపెనీలు ఏళ్ల తరబడి నష్టాల్లోనే కొనసాగుతున్నా, ఈ నష్టాలను భర్తీ చేసుకోగల స్పష్టమైన వ్యాపార నమూనా ఇప్పటికీ కనిపించడం లేదు. అయినప్పటికీ పెట్టుబడిదారులు ఎందుకు నిరంతరం డబ్బు కుమ్మరిస్తున్నారన్న ప్రశ్నకు, భవిష్యత్తులో ఏఐ ద్వారా వచ్చే భారీ లాభాల ఆశే కారణమని నిపుణుల విశ్లేషణ. ఏఐ మార్కెట్‌లో వాటాలకున్న భారీ ప్రాధాన్యతను బట్టి, ఈ బుడగ పేలినప్పుడు సాధారణ ప్రజలు, పింఛనుదారులు సహా విస్తృత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే బుడగ పేలిన తర్వాత మాత్రం.. ఏఐ సాధనాలను వాస్తవికంగా ఏ రంగాల్లో, ఎంతమేరకు ఉపయోగించుకోవచ్చో సరైన మదింపు చేసుకునే అవకాశం లభిస్తుందన్నది నిపుణుల మాట. ఏఐ సాంకేతికత పనికిరానిదని కాదు, దాని ఆచరణీయ ఉపయోగాలు ఇంకా పూర్తిగా వెలుగులోకి రాలేదన్నదే ఈ విశ్లేషణ సారాంశం. మొత్తంగా చూస్తే, ప్రస్తుత ఏఐ పెట్టుబడుల విస్ఫోటనం సాంకేతిక పురోగతికి నాంది కావచ్చు లేదా చరిత్రలో మరో భారీ ఆర్థిక తప్పిదంగా మిగిలిపోవచ్చు– కానీ ఈ రెండు అవకాశాల మధ్య నలుగుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాత్రం జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది!! ■



మీరు ఇప్పుడిప్పుడే కెరీర్‌లో ముందడుగు వేస్తుంటే.. ముందుగా మీ గురించి మీకొక బలమైన నమ్మకాన్ని, అభిప్రాయాన్ని ఏర్పరుచుకోండి. మీరు ఎలాంటి వారో, ఎలాంటి వారు కాదో మీకు కచ్చితంగా తెలిసుండాలి. ఆ స్పష్టత లేకపోతే.. ఎవరో ఒకరు మీరు ఎలాంటి వారో నిర్ణయించడానికి ప్రయత్నిస్తారు. కాలక్రమేణా ఆ అబద్ధాన్నే మీరు నిజమని నమ్మడం మొదలుపెడతారు. ఇతరుల మాటలు, అభిప్రాయాలే మీ గుర్తింపుగా మారిపోతాయి. అందుకే మీ విలువలు, మీ సామర్థ్యాలు మీకు ముందే తెలిసుండటం చాలా అవసరం. అప్పుడే ఎవరు ఏమి చెప్పినా మీ అస్తిత్వం చెక్కుచెదరదు.

-మహాదేవ

### వింతల్లో వింతలు

## యంత్ర మానవులు



చైనా టెక్ దిగ్గజం యుబెటెక్ సరికొత్త హ్యూమనాయిడ్లను ఆవిష్కరించింది. యూవరల్డ్ యు1 సిరీస్‌లో పురుష, స్త్రీ మోడళ్లు 183, 169 సెం.మీ ఎత్తుతో, మనుషులకంటే సగం బరువుతో రూపొందాయి. బయోమిమెటిక్ చర్మం, మానవ కదలికలను 90 శాతం పునఃసృష్టించే మెడ నిర్మాణం వీటి ప్రత్యేకతలు. కేవలం 20 మిల్లీసెకన్లలోపే మాటలకు, పెదవుల కదలికలకు సమన్వయం సాధించే ఫేషియల్ యాక్చుయేషన్ వ్యవస్థ, 20కి పైగా భావోద్వేగాలను 90శాతం కచ్చితత్వంతో గుర్తించే ఏఐ మెదడు వీటిలో ఉన్నాయి. తోడుగా ఉండటం, వృద్ధుల సంరక్షణ, హాస్పిటాలిటీ, పరిశోధనవంటి రంగాల్లో వినియోగానికి ఇవి ఉపయోగపడతాయని కంపెనీ తెలిపింది. ఇప్పటికే 10,000కు పైగా ఆర్డర్లు రాగా, ధర 17,000 డాలర్ల నుంచి 1,45,000 డాలర్ల వరకూ ఉంది. సెప్టెంబర్‌లో తొలి డెలివరీలు జరగనున్నాయట.

# ఆకు కాదిది ఔషధ గని

వాము ఆకులు యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీబయాటిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి దీర్ఘకాలిక ఆరోగ్యానికి అమృతంగా పనిచేస్తాయి. జలుబు, గొంతులో గరగరతో బాధపడుతున్నవారికి వామ కులతో రసం చేసుకుని తాగితే కఫం అంతా క్లియర్ అవుతుంది.ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, మీరు వాము ఆకులను నమలడం వల్ల, ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను దూరంగా ఉంచడంలో మీకు సహాయపడుతుంది. వాము ఆకులను నీటిలో మరిగించి తాగడం వల్ల శ్వాసకోశ సమస్యలు దూరంగా ఉంటాయని అనేక పరిశోధనల్లో వెల్లడైంది. ఈ ఆకు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.వాము ఆకులు మరిగించిన నీటిలో ఇంగువ, నల్ల ఉప్పు కలిపి తీసుకుంటే, అది కడుపు నొప్పి నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. ఇవి అనాల్జేసిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి పంటి నొప్పి, తలనొప్పి, శరీర నొప్పుల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఆకులను మెత్తగా చేసి, ప్రభావిత ప్రాంతానికి లేపంగా అప్లై చేయటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వాము ఆకులతో చట్నీ కూడా తయారు చేసుకోవచ్చు. చట్నీ చేయడానికి, ఆకులను వెల్లుల్లి, పచ్చిమిర్చి, కొద్దిగా నిమ్మరసంతో కలిపి తయారు చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా వామాకుల రసం రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అనేక తీవ్రమైన వ్యాధుల్ని నివారిస్తుంది. రోజూ రెండు ఆకులు నమలడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరుగుతుంది. వాము ఆకుల రసం తీసుకోవడం ఆర్థరైటిస్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇది కీళ్ల నొప్పులు, వాపుల్ని తగ్గించడంలో సాయపడుతుంది. ఇది బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాము ఆకుల



రసం తాగడం వల్ల కళ్లకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన కళ్లు, కంటి చూపును నిర్వహించడానికి అవసరం. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. వాము ఆకు కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడంలో సహాయపడుతుంది. వాము ఆకులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్, ప్రోటీన్స్ తదితర ఖనిజాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు సమస్యలను దూరం చేస్తుంది. వాము ఆకు తింటే జీవక్రియ సక్రమంగా జరుగుతుంది. ఈ ఆకు తింటే అధిక రక్తపోటు సైతం నియంత్రణలోకి వస్తుంది.

# ఇష్టమని ఈ మాంసం తెగ లాగించేస్తున్నారా?



చాలా మందికి ముక్క లేనిదే ఒక్క పూట కూడా ముద్ద దిగదు. చికెన్, మటన్ ఏదైనా సరే తప్పక వారి మెనూలో ఉండాల్సిందే. అయితే చాలా మంది రెడ్ మీట్ ఎక్కువగా తింటారు. చాలా మందికి ముక్క లేనిదే ఒక్క పూట కూడా ముద్ద దిగదు. చికెన్, మటన్ ఏదైనా సరే తప్పక వారి మెనూలో ఉండాల్సిందే. అయితే చాలా మంది రెడ్ మీట్ ఎక్కువగా తింటారు. కానీ దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల జరిగే అనర్థాల గురించి పట్టించుకోరు. నిజానికి ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం.వారానికి 1 లేదా 2 సార్లు రెడ్ మీట్ తినవచ్చు. ఒకేసారి 80 నుంచి 100 గ్రాముల వండిన రెడ్ మీట్ తినడం ఆరోగ్య కరం. ఇలా వారానికి మొత్తం 300 నుంచి 350 గ్రాములకు మించకూడదు. ఎందుకంటే ఎక్కువ రెడ్ మీట్ తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, కొవ్వు కాలేయం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల రెడ్ మీట్ మితంగా తినడం, తక్కువ కొవ్వు ఉన్న ముక్కలను ఎంచుకోవడం, తక్కువ నూనెలో ఉడకబెట్టడం ఆరోగ్యకరం. నిపుణుల ఆహార మార్గదర్శకాల ప్రకారం నెయ్యి, వెన్న, పూర్తి కొవ్వు పాలు వంటి సంతృప్త కొవ్వులతో ఎంత ప్రమాదమో రెడ్ మీట్‌తోనూ అంతే ప్రమాదమని చెబుతున్నారు.కొవ్వు కాలేయ రోగులు రెడ్ మీట్ తినవచ్చు, కానీ పరిమిత పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. రెడ్ మీట్‌లో సంతృప్త కొవ్వు అధికంగా ఉంటుంది. కాబట్టి, దానిని ఎక్కువగా తినడం వల్ల కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది. దీంతో కొవ్వు కాలేయ సమస్యలు మరింత తీవ్రమవుతాయి. అందువల్ల మీరు వారానికి ఒకసారి వైద్యుడి సలహా మేరకు దీనిని తీసుకోవచ్చు. ఆహారంలో రెడ్ మీట్ తీసుకోవడం తప్పనిసరి కాదు. శరీరానికి అవసరమైన ప్రోటీన్, ఇనుము, విటమిన్లు, ఇతర పోషకాలను పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, పాలు, పెరుగు, జున్ను, గుడ్లు, చేపలు, సోయాబీన్స్, వేరుశెనగ వంటి ఆహారాల ద్వారా కూడా అందుతుంది.

# అల్లరి చేస్తున్నారనీ పిల్లలకు ఫోన్ ఇస్తున్నారా?



పిల్లలు అన్నం తినడం లేదనో.. అల్లరి చేస్తున్నారనో.. వారి చేతికి స్మార్ట్‌ఫోన్ ఇస్తున్నారా? అయితే మీరు స్క్రీన్ బ్రైబ్ ట్రాప్‌లో పడిపోయినట్టే. దీనివల్ల మీ పిల్లలు ఏం కోల్పోతున్నారో తెలిస్తే షాక్ అవుతారు! దీనినే నిపుణులు స్క్రీన్ బ్రైబ్ లేదా డిజిటల్ లంచం అని పిలుస్తున్నారు.

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లలను ఆడించడం తల్లిదండ్రులకు పెద్ద టాస్క్‌గా మారిపోయింది. ఆఫీస్ పని ఒత్తిడిలోనో లేక కాసేపు ప్రశాంతంగా ఉండాలనో చాలామంది పేరెంట్స్ చేస్తున్న పని.. పిల్లల చేతికి స్మార్ట్‌ఫోన్ ఇవ్వడం. దీనినే నిపుణులు స్క్రీన్ బ్రైబ్ లేదా డిజిటల్ లంచం అని పిలుస్తున్నారు. అయితే ఈ చిన్న అలవాటు మీ పిల్లల ఎదుగుదలను నిలువునా దహించి వేస్తోందని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. పిల్లలు మారాం చేసినప్పుడు లేదా వారు ఏడుస్తున్నప్పుడు వారిని శాంతింపజేయడానికి ఫోన్ ఇవ్వడాన్ని స్క్రీన్ బ్రైబ్ అంటారు. ఇది తాత్కాలికంగా ఉపశమనం కలిగించినా, దీర్ఘకాలంలో పిల్లలను మానసిక రోగులుగా మార్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ అలవాటు వల్ల తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి అత్యంత విలువైన 4 విషయాలను దొంగిలిస్తున్నట్లే లెక్క.పిల్లలు ఇతరులతో మాట్లాడితేనే భాష వస్తుంది. కానీ ఫోన్‌కు అలవాటు పడిన పిల్లలు కేవలం వినడానికే పరిమితం అవుతున్నారు. దీంతో వారిలో కమ్యూనికేషన్ స్కిల్స్ దెబ్బతింటున్నాయి. నేటి కాలంలో చాలామంది పిల్లల్లో స్పీచ్ డిలే అంటే మాటలు ఆలస్యంగా రావడానికి ప్రధాన కారణం ఇదే. చుట్టుపక్కల మనుషులతో ఎలా ఉండాలి? ఎవరైనా వస్తే ఎలా పలకరించాలి? వంటి ప్రాథమిక విషయాలను పిల్లలు కోల్పోతున్నారు. స్క్రీన్ ప్రపంచంలో మునిగిపోవడం వల్ల వారు ఒంటరితనాన్ని అలవాటు చేసుకుంటున్నారు. ఇది భవిష్యత్తులో వారిని విపరీతమైన మొండితనం ఉన్నవారిగా మార్చే అవకాశం ఉంది. పిల్లలకు బోర్ కొట్టినప్పుడు వారు సొంతంగా ఏదైనా నేర్చుకోవాలి. కానీ ఆ ఖాళీని ఫోన్‌తో నింపడం వల్ల వారికి ఓర్పు నశిస్తోంది. ఫోన్ లాక్కున్న వెంటనే విపరీతమైన కోపం తెచ్చుకోవడం, వస్తువులను విసిరేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తమ భావోద్వేగాలను ఎలా అదుపు చేసుకోవాలో వారు నేర్చుకోలేకపోతున్నారు. ఖాళీ సమయంలో పిల్లలు మట్టిలో ఆడటం, బొమ్మలు గీయడం వంటివి చేయాలి. కానీ నిరంతరం వీడియోలు చూడటం వల్ల వారి మెదడు ఆలోచించడం మానేస్తుంది. కేవలం స్క్రీన్‌పై వచ్చే రంగులు, శబ్దాలకు మాత్రమే వారు స్పందిస్తారు. దీనివల్ల వారిలో క్రియేటివిటీ పూర్తిగా నశించిపోతుంది. పిల్లలను ఆడించడానికి ఫోన్‌ను ఒక సాధనంగా వాడకండి. పిల్లలకు బోర్ కొడితేనే వారు కొత్త ఆటలను కనిపెడతారు. వారి ఆలోచనలకు పదును పెట్టనివ్వండి. రోజులో కనీసం గంట సేపు ఫోన్లు పక్కన పెట్టి పిల్లలతో గడపండి. వారితో కలిసి చిన్న చిన్న ఇంటి పనులు చేయండి. మీ బిడ్డ చేతిలో ఉన్న ఫోన్ కేవలం ఒక గ్యాడ్జెట్ మాత్రమే కాదు.. అది వారి మేధస్సును హరించే ఆయుధం అని గుర్తుంచుకోండి. ఇప్పటికైనా మేల్కొనకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

## పిల్లలు త్వరగా మెచ్యూర్ అవుతున్నారా?

ఇటీవల కాలంలో ఆడపిల్లలు చిన్న వయసులోనే మెచ్యూర్ అవుతున్న సంఘటనలు తల్లిదండ్రుల్లో పెద్ద ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో సాధారణంగా 12?14 ఏళ్ల తర్వాతే అమ్మాయిలు మెచ్యూర్ అవుతారు. కానీ ఇప్పుడు జీవనశైలి మార్పులు, ఆహార అలవాట్లు వలన కొన్నిసార్లు చిన్న వయసులోనే ప్యూబర్టీ (రజస్వలత్వం) కనిపిస్తోంది. ఇటీవల కాలంలో ఆడపిల్లలు చిన్న వయస్సులోనే మెచ్యూర్ అవడం కొందరు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇంతకుముందు 12 నుంచి 14 ఏళ్ల తర్వాతే అమ్మాయిలు మెచ్యూర్ అయ్యేవారు. కానీ, ఇప్పుడు మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చిన్న వయస్సులోనే రజస్వల(ఖబీఎఎవతీబిఎ) అవుతున్నారు. అయితే, ఇందుకు కారణం చికెన్, గుడ్లు, ప్యాకెట్ పాలు లాంటి పదార్థాలేనని కొంతమంది భావిస్తున్నారు. కానీ, ఇతర కారణాలు కూడా అయి ఉండవచ్చు. మరి చిన్న వయస్సులోనే ఆడ పిల్లలు మెచ్యూర్ కావడానికి ఇవే కారణమా? లేక వేరే ఏమైనా కారణాలు ఉన్నాయా? వైద్య నిపుణులు చెబుతున్న కారణాలు ఏమిటి? చికెన్ తినడం వల్ల మెచ్యూర్ త్వరగా వస్తుందన్నది చాలా మంది చెప్పే విషయం. కానీ, పరిశోధనలు మాత్రం చికెన్ వల్ల మెచ్యూర్ త్వరగా వస్తుందని స్పష్టమైన ఆధారం లేదు. అసలు ఈ విషయానికి సంబంధించిన పెద్ద స్థాయిలో పరిశోధనలు కూడా లేదు. చికెన్‌లో హార్మోన్లు ఉంటాయని కొందరు అంటారు, కానీ ఆ హార్మోన్లు మన శరీరానికి ప్రభావం చూపే స్థాయిలో ఉండవు అని వైద్యులు చెప్తున్నారు. పాలు ఆరోగ్యానికి మంచిదనే విషయం అందరికీ తెలుసు. అయితే పాలు తాగితే మెచ్యూర్ ముందుకు వస్తుందా? అంటే.. ఇక్కడ కూడా శాస్త్రంగా నిర్ధారించబడిన స్పష్టమైన సంబంధం లేదు. పాలు తాగడం వల్ల శరీర బరువు పెరిగితే.. అది మెచ్యూర్ కారణమవ్వొచ్చు. కానీ పాలే కారణమని చెప్పడం సరికాదు. గుడ్లు ఆరోగ్యకరమైన ప్రోటీన్ అందిస్తాయి. మెచ్యూర్ త్వరగా వచ్చే కారణంగా గుడ్లు ప్రస్తావించడం సరైనది కాదు. గుడ్లు ఎక్కువగా తినడం వల్లే మెచ్యూర్ అవుతారని చెప్పడం కూడా సరైనది కాదు. మెచ్యూర్ (మొదటి రక్తస్రావం) త్వరగా వస్తే దానికి కారణాలు చాలా ఉంటాయి. బరువు ఎక్కువగా ఉన్న పిల్లల్లో హార్మోన్ స్థాయిలు మారి మెచ్యూర్ ముందుకు రావడం సాధారణం. ఫాస్ట్ ఫుడ్, తీపి పానీయాలు, ప్రాసెస్ చేసిన స్నాక్స్ ఎక్కువగా తింటే శరీర బరువు పెరుగుతారు. అంతేకాక, ఇవి హార్మోన్లపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటి ద్వారా కూడా తొందరగా మెచ్యూర్ అయ్యే అవకాశం ఉంది.ప్లాస్టిక్ బాటిల్స్, కెమికల్స్, పెస్టిసైడ్స్ వంటి వాటిలో ఉండే రసాయనాలు హార్మోన్ వ్యవస్థను ప్రభావితం చేసి మెచ్యూర్ ముందుకు తీసుకురావచ్చు. సమతుల ఆహారం.. పండ్లు, కూరగాయలు, మాంసం, బియ్యం, పప్పు తీసుకోవడం. వైయామం/ఆట.. రోజుకు కనీసం 30 నిమిషాలు. జంక్ ఫుడ్ తగ్గించండి. పర్యావరణం గురించి జాగ్రత్త.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి. సమయానికి ఆరోగ్య పరీక్షలు.. 8 సంవత్సరానికి ముందే మెచ్యూర్ లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ని సంప్రదించండి. చివరగా.. చికెన్, పాలు, గుడ్లు తింటే అమ్మాయిలలో మెచ్యూర్ ముందుకు వస్తుందని శాస్త్రంగా నిర్ధారించలేదు. మెచ్యూర్ త్వరగా వచ్చే కారణం ఆహారం కాదు, పూర్తి జీవనశైలి, బరువు, జన్యు, పర్యావరణం వంటి అంశాలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయి.

# రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోతున్నారా?



నేటి జీవనశైలిలో చాలామంది సరైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. పని ఒత్తిడి, మొబైల్ వినియోగం, టీవీ, సోషల్ మీడియా వంటి అలవాట్ల కారణంగా రోజుకు 7 గంటల కంటే తక్కువ నిద్రపోవడం సాధారణమైపోయింది. అయితే, ఈ అలవాటు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మనిషి చాలా ఆరోగ్యకరమైన విషయాలకు దూరమవుతున్నాడు. అందులో ప్రధానమైనది నిద్ర. మారుతున్న జీవనశైలి, ఉద్యోగ సమయాలు ఇందుకు కారణమవుతున్నాయి. ఉద్యోగాలు చేస్తున్నవారు రాత్రి వేళల్లోనూ పనిచేయడం, ఇంట్లో ఉంటే ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి సమయానికి నిద్రపోవడం లేదు. రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం ఆలస్యంగా మేల్కోవడం అనేవి రెండూ కూడా మనిషి ఆరోగ్యానికి హానికరమైనవేనని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయంలో 7 గంటల కంటే తక్కువగా నిద్రపోయే వారిలో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. అందుకే రాత్రి సమయంలో తప్పనిసరిగా 7 గంటలపాటు నిద్రకు సమయం కేటాయించాలని సూచిస్తున్నారు. నిద్ర తక్కువైతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి? నిద్ర అనేది శరీరానికి విశ్రాంతి మాత్రమే కాదు. శరీర కణాలు పునరుద్ధరించబడతాయి. మెదడు జ్ఞాపకశక్తిని బలోపేతం చేస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యం అవుతాయి. అందుకే పెద్దవారికి రోజుకు కనీసం 7?8 గంటల నిద్ర తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. మానసిక ఆరోగ్యంపై ప్రభావం.. తక్కువ నిద్ర వల్ల ఒత్తిడి (ాబితీవబబ) పెరుగుతుంది. ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు రావచ్చు. చిరాకు, కోపం ఎక్కువవుతాయి. గుండె సంబంధిత సమస్యలు.. నిద్ర లోపం దీర్ఘకాలంగా ఉంటే.. అధిక రక్తపోటు, గుండెపోటు ప్రమాదం, స్ట్రోక్ వచ్చే అవకాశం పెరుగుతుంది. షుగర్, బరువు పెరగడం.. తక్కువ నిద్ర వల్ల ఇన్సులిన్ పనితీరు తగ్గుతుంది. ఆకలి పెంచే హార్మోన్లు ఎక్కువవుతాయి. ఊబకాయం (ాఎవబతిబిఎ), టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. రోగనిరోధక శక్తి తగ్గిపోవడం.. నిద్ర సరిపోకపోతే శరీరం వైరస్‌లు, ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే శక్తిని కోల్పోతుంది. దీంతో తరచూ జలుబు, జ్వరం, అలసట లాంటివి వస్తుంటాయి. జ్ఞాపకశక్తి, పనితీరు తగ్గడం.. తక్కువ నిద్ర ఏకాగ్రతను తగ్గిస్తుంది. జ్ఞాపకశక్తి బలహీనమవుతుంది. పని లేదా చదువులో పని తీరు పడిపోతుంది.

# చెరకుగడ లాభాలు..

చెరకుగడను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. చెరకు గడను నేరుగా తీసుకోవడం వల్లే ఎక్కువ లాభాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెరకుగడ.. చక్కెర, బెల్లంకు ముడి సరకు అయిన దీనిని మనం చాలా తక్కువగా తీసుకుంటాం. మార్కెట్లు, బజార్లలో వీటిని ఎక్కువగా అమ్ముతుంటారు. కానీ, మనం ఎక్కువగా వీటిని పట్టించుకోం. కొన్నిసార్లు చెరకు రసం జ్యూస్ రూపంలో తీసుకుంటాం. కానీ, చెరకు గడను నేరుగా తీసుకోవడం వల్లే ఎక్కువ లాభాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. చెరకు రసం తాగితే లాభం ఉంటుందని చాలా మందికి తెలిసినప్పటికీ.. చెరకుగడ తినడం ఆరోగ్యానికి ఇంకా మంచి ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చెరకు గడలో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వల్ల పేగులు సక్రియంగా పనిచేస్తాయి. జీర్ణం మెరుగవుతుంది. అజీర్ణం తగ్గుతుంది. గ్యాస్ సమస్య తగ్గుతుంది. చెరకు గడను తినడం వల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. ఎందుకంటే.. ఇది ఆకలిని నియంత్రిస్తుంది. తక్కువ తింటారు. దీంతో బరువు తగ్గడానికి ఇది సహాయపడుతుంది. ఇది "నేచురల్ డైట్ ఫైబర్" లా పని చేస్తుంది. చెరకు గడలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఆహారంలో ఉండే షుగర్ శరీరంలో వేగంగా జీర్ణం అవుతుంది. దీంతో రక్తంలో గ్లూకోస్ స్థాయి స్టేబుల్ అవుతుంది. డయాబెటిస్ ఉన్నవారికి కూడా మితంగా మంచిది. కానీ, డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే తినాలి. ఇది కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. చెరకు గడలో ఉండే పోషకాలు శరీరాన్ని డీటాక్స్ చేస్తాయి. అందువల్ల కాలేయం క్లీనింగ్ అవుతుంది. విషకణాలు బయటకు బయటకు పోతాయి. శరీరం శుభ్రంగా ఉంటుంది. శరీరంలో నీటి సమతుల్యతను కాపాడుతుంది. చెరకు గడ తినడం వల్ల శరీరంలో నీటి సమతుల్యత నిల్వ ఉంటుంది. దీని వల్ల డీహైడ్రేషన్ తగ్గుతుంది. చర్మం మృదువుగా ఉంటుంది. వేడిలో శరీరం తేమగా ఉంటుంది. చెరకు గడలో ఉండే ఫైబర్, విటమిన్స్, ఖనిజాలు హృదయానికి కూడా ఉపయోగపడతాయి. కాలేయంలో కొవ్వు తగ్గించడంలో సహాయం చేస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయం చేస్తుంది. దీంతో హృదయ ఆరోగ్యం మెరుగవుతుంది. చెరకు గడలో ఉండే తీపి పదార్థం శరీరానికి శక్తి ఇస్తుంది. ఇది అలసట తగ్గిస్తుంది. పని చేయడానికి ఎనర్జీ ఇస్తుంది. రోజువారీ శక్తి అవసరాన్ని తీర్చుతుంది.

## బెడ్ మీద కూర్చొని తింటున్నారా..?

మీకు మంచం మీద కూర్చుని టీవీ చూస్తూ భోజనం చేసే అలవాటు ఉందా..? అయితే మీరు తెలియకుండానే పెద్ద ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నారు. చూడటానికి ఇది చాలా సౌకర్యంగా అనిపించినా.. మీ జీర్ణవ్యవస్థను, నిద్రను, చివరికి మీ చర్మాన్ని కూడా ఇది దెబ్బతీస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలామందికి రాత్రిపూట లేదా ఖాళీ సమయాల్లో మంచం మీద కూర్చుని, టీవీ చూస్తూనో లేదా మొబైల్ వాడుతూనో భోజనం చేయడం అలవాటు. ఇది ఎంతో హాయిగా, సౌకర్యంగా అనిపించవచ్చు. కానీ ఈ చిన్న అలవాటు మీ ఆరోగ్యానికి ఎంతటి చేటు చేస్తుందో తెలుసా..? మంచం మీద తినడం వల్ల కలిగే అనర్థాలపై ఆరోగ్య నిపుణులు గట్టిగా హెచ్చరిస్తున్నారు. మనం ఆహారం తిన్నప్పుడు మన శరీరం నిటారుగా ఉండాలి. అప్పుడే ఆహారం అన్నవాహిక ద్వారా కడుపులోకి సులభంగా వెళుతుంది. మంచం మీద కూర్చున్నప్పుడు మనం నిటారుగా ఉండము, దీనివల్ల జీర్ణ రసాలు సరిగ్గా ఉత్పత్తి కావు. పడుకుని తినడం వల్ల ఆహారం అన్నవాహికలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. ఇది తీవ్రమైన ఎసిడిటీ, గ్యాస్, గుండెల్లో మంటకు దారితీస్తుంది.మంచం మీద తింటున్నప్పుడు మన దృష్టి ఆహారం మీద కంటే టీవీ లేదా మొబైల్ స్క్రీన్‌పైనే ఎక్కువగా ఉంటుంది. దీనిని మైండ్‌లెస్ ఈటింగ్ అంటారు. అంటే మనం ఎంత తింటున్నామో మన మెదడుకు సరిగ్గా తెలియదు. దీనివల్ల అవసరానికి మించి ఎక్కువగా తినేస్తాం. ఫలితంగా ఊబకాయం, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. మంచం మీద తిన్నప్పుడు మనకు తెలియకుండానే చిన్న చిన్న ఆహార కణాలు పరుపులు, దుప్పట్లపై పడతాయి. ఇవి కంటికి కనిపించవు కానీ, బ్యాక్టీరియా, ఇతర కీటకాలను ఆకర్షిస్తాయి.

# మూడో టీ20లో బౌలింగ్‌లో మార్పులకు సిద్ధం.. టీమిండియాలో అదనపు పేసర్‌కు అవకాశం!

- మూడో టీ20లో భారత్‌కు విజయం తప్పనిసరి
- సిరీస్‌లో ఇంగ్లండ్ 1-0 ఆధిక్యం
- బిష్ణోయ్ స్థానంలో ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం
- నిలకడగా రాణిస్తున్న వారిలో అభిషేక్ శర్మ ఒక్కడే
- బ్యాటింగ్, బౌలింగ్‌లో మెరుగుదలపై భారత్ దృష్టి
- మంగళవారం రాత్రి 10 గంటలకు ట్రెంట్ బ్రిడ్జ్‌లో మ్యాచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** వరుస పరాజయాలతో ఒత్తిడిలో ఉన్న భారత జట్టు.. ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగే మూడో టీ20లో తప్పక గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా రాత్రి 10 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. రెండో మ్యాచ్‌లో ఓటమిపాలై సిరీస్ లో వెనుకబడిన భారత్‌కు ఈ మ్యాచ్ 'డూ ఆర్ డై'గా మారింది. మరోవైపు ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్ ఈ మ్యాచ్ గెలిచి మరింత ఆధిక్యంలోకి వెళ్లాలని చూస్తోంది. ఈ ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో తొలి మ్యాచ్ వర్షం వల్ల ఫలితం తేలకుండానే రద్దయింది. రెండో మ్యాచ్ లో ఇంగ్లండ్ గెలిచింది. దాంతో నేటి మ్యాచ్ టీమిండియాకు కీలకంగా మారింది. రెండో మ్యాచ్‌లో భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ నిరాశపరిచింది. ముఖ్యంగా బౌలింగ్ విభాగం తీవ్రంగా విఫలమైంది. రెండో టీ20లో స్పిన్నర్ రవి బిష్ణోయ్ నాలుగు ఓవర్లలో 60 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతేకాదు, ఒకే ఓవర్లో మూడు బ్యాక్‌ఫుట్ నోబాల్స్ వేయడంతో జట్టు భారీ మూల్యం చెల్లించుకుంది. దీంతో మూడో మ్యాచ్‌లో బౌలింగ్ కూర్పులో మార్పులు చేయాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. బిష్ణోయ్ స్థానంలో యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం లభించే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రసిద్ధ్ కృష్ణ కంటే ప్రిన్స్ యాదవ్‌కే జట్టు మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. బ్యాటింగ్‌లోనూ భారత జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రమే 59, 43 పరుగులతో నిలకడగా ఆడుతున్నాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ కొంతమేర పరుగులు చేసినా మ్యాచ్‌ను మలిచే ఇన్నింగ్స్ ఆడలేకపోయారు. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన తొలి అంతర్జాతీయ సిరీస్‌లో గుర్తుండిపోయే ప్రదర్శన చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. సిరీస్‌లో నిలవాలంటే బ్యాటింగ్‌లో దూకుడు, బౌలింగ్‌లో కచ్చితత్వం తప్పనిసరి అని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో వికెట్లు తీయడం, డెత్ ఓవర్లలో పరుగులను నియంత్రించడం భారత్‌కు కీలకంగా మారింది.

# నార్వే చేతిలో బ్రెజిల్ ఘోర ఓటమి.. వెక్కి వెక్కి ఏడుస్తూ కెరీర్‌కు గుడ్ బై చెప్పిన నెయ్‌మార్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా వరల్డ్ కప్--2026 లో బ్రెజిల్ ప్రయాణం ముగిసింది. నార్వే చేతిలో 2-1 తేడాతో ఓడిపోవడంతో వరల్డ్ కప్ నుంచి ఔట్ అయ్యింది. మ్యాచ్ లో విజిల్ కేవలం బ్రెజిల్ ప్రపంచ కప్ నుండి బయటకు పంపడమే కాకుండా.. ఆ దేశ స్టార్ ప్లేయర్ నెయ్‌మార్‌ను కన్నీళ్లు పెట్టుకునేలా చేసింది. జూలై 5, శనివారం జరిగిన రౌండ్ ఆఫ్ 16లో నార్వే చేతిలో బ్రెజిల్ 2-1 తేడాతో ఓడిపోయింది. దీంతో సీనియర్ ఫార్వర్డ్ మోకాళ్లపై కూర్చొని ప్రార్థించి, ఆ తర్వాత కన్నీళ్లు పెట్టుకున్నాడు. గ్రౌండ్ లో ఈ ఎమోషనల్ దృశ్యాలు వైరల్ గా మారాయి. నెయ్‌మార్ కన్నీళ్లను ఆపుకోలేక ఇబ్బంది పడుతుండగా, అతని సహచర ఆటగాడు రాఫిన్హా వచ్చి ఓదార్చుతున్న వీడియో వైరల్ గా మారింది. టోర్నమెంట్ నుంచి బ్రెజిల్ ఎగ్జిట్ అయ్యిందన్న ఆవేదన, ఇక తన చివరి మ్యాచ్ ఇదే అనే ఆందోళనతో చాలాసేపు వెక్కివెక్కి ఏడుస్తూ గ్రౌండ్లోనే కూర్చుని ఉండిపోయాడు.

**బ్రెజిల్ పోరాటం వృథా..**

నాకౌట్ పోరులో బ్రెజిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగినప్పటికీ.. నార్వే అద్భుత ప్రదర్శనతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. నార్వే గోల్ కీపర్ ఓర్జాన్ నైలాండ్, స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్‌ల పట్టుదలతో నార్వే అద్భుత విజయాన్ని సాధించింది. పోటీ అంతటా నైలాండ్ బ్రెజిల్‌ను నిరాశపరిచాడు. ఫస్ట్ హాఫ్ లో బ్రూనో గిమారేస్ పెనాల్టీని ఆపిన నైలాండ్.. ఆ తర్వాత చేసిన వరుస సేవ్స్ నార్వేను ఆధిక్యంలో ఉంచడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత సెకండ్ హాఫ్ లో హాలాండ్ రెండుసార్లు గోల్ చేసి, స్కాండినేవియన్ జట్టుకు చారిత్రాత్మక విజయంతో క్వార్టర్-ఫైనల్స్ అంచుకు చేర్చాడు. స్టాపేజ్ టైమ్ చివరి నిమిషాల్లో, బాక్స్ లోపల కాసెమిరోపై ఫౌల్ జరిగిందని తేలడంతో, రిఫరీ వివాదాస్పద పెనాల్టీని ఇవ్వడంతో బ్రెజిల్‌కు చివరి ఆశ చిగురించింది. నెయ్‌మార్ ముందుకు వచ్చి, ప్రశాంతంగా పెనాల్టీని గోల్‌గా మలిచి, తేడాను 2-1కి తగ్గించాడు. అయితే, ఆ గోల్ కేవలం ఓదార్పుగా మాత్రమే మిగిలిపోయింది. చివరి క్షణాల వరకు దృఢంగా నిలబడిన నార్వే.. బ్రెజిల్ ఆశలకు గండికొట్టింది. చివరి ప్రపంచ కప్ ఆడుతున్న నెయ్ మార్.. నార్వేతో ఓటమిని జీర్ణించుకోలేకపోయాడు. టోర్నమెంట్ నుంచి టీమ్ ఎగ్జిట్ కావడం తట్టుకోలేక.. భావోద్వేగానికి గురయ్యాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్న దృష్యాలను చూసి ఫ్యాన్స్ కన్నీటిపర్యంతం అయ్యాడు. సహచర ఆటగాళ్లు ఓదార్చడానికి ప్రయత్నించగా మరింత దుఖసంద్రంలో మునిగిపోయాడు. కన్నీళ్లతో నిలబడి రాఫిన్హాను కౌగిలించుకున్నాడు. గాయం కారణంగా నెలల తరబడి ఆటకు దూరంగా ఉన్న నెయ్ మార్.. ఆశతో ప్రారంభమైన టోర్నమెంట్ ఇలా అర్థంతరంగా ముగియటంతో దుఖాన్ని ఆపుకోలేకపోయాడు. తన ఫుట్ బాల్ ప్రయాణానికి తుది వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు.

# ఆరు వికెట్లతో చెలరేగిన గుర్నూర్ బ్రార్.. రెండో టెస్టులో ఇండియా-ఎ గెలుపు



**హైదరాబాద్ పెన్ పవర్:** బౌలింగ్‌లో గుర్నూర్ బ్రార్ (6/68) సూపర్ షో చూపెట్టడంతో.. శ్రీలంక--ఎతో జరిగిన అనధికార రెండో టెస్ట్‌లో ఇండియా-ఎ 10 వికెట్ల తేడాతో గెలిచింది. దాంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకుంది. లంక నిర్దేశించిన 33 రన్స్ లక్ష్యాన్ని ఛేదించేందుకు ఆదివారం నాలుగో రోజు బరిలోకి దిగిన ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో 6.2 ఓవర్లలో 36/0 స్కోరు చేసి గెలిచింది. సాయి సుదర్శన్ (25 నాటౌట్), అమన్ మోఖడే (11 నాటౌట్) ఈజీగా గెలిపించారు. అంతకుముందు 541/8 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో 143.3 ఓవర్లలో 543 రన్స్‌కు ఆలౌటైంది. సారాన్ష్ జైన్ (70 నాటౌట్) మెరుగ్గా ఆడాడు. కేశర నువాంత 5, సుదీర 3 వికెట్లు తీశారు. తర్వాత లంక రెండో ఇన్నింగ్స్‌లో 48.3 ఓవర్లలో 209 రన్స్‌కు ఆలౌటైంది. దాంతో ఇండియా ముందు 33 రన్స్ లక్ష్యాన్ని ఉంచింది. ఆషెన్ బండార (87) టాప్ స్కోరర్. నువాంత (26), సుదీర (21) ఫర్వాలేదనిపించారు.

# వరుస ఫ్లాప్స్ లో వున్న హీరోలకు అదృష్టం తెచ్చిన దర్శకులు!



ఆకర్షణీయమైన రత్న వర్ణాల దుస్తుల్లో మెరిసిపోతున్న సంయుక్త



సినిమా ఇండస్ట్రీలో హిట్లు, ఫ్లాపులు చాలా సహజం. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా కొన్నిసార్లు వరుస పరాజయాలతో సతమతమవ్వక తప్పదు. అలాంటి క్లిష్ట సమయంలో కొందరు ట్రెండింగ్ దర్శకులు తమ అద్భుతమైన టేకింగ్, పవర్ ఫుల్ మాస్ కథలతో ఆ హీరోలకు ఊహించని రేంజ్ లో కం బ్యాక్ ఇచ్చారు. థియేటర్లలో పూనకాలు తెప్పించి, బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ఆ క్రేజీ కాంబినేషన్ల విశేషాలు ఇప్పుడు చూద్దాం.

**పవన్ కళ్యాణ్ రేంజ్ మార్చిన 'గబ్బర్ సింగ్':** 'తీన్ మార్', 'పంజా' లాంటి వరుస పరాజయాలతో పవన్ కళ్యాణ్ కెరీర్ కొంచెం డల్ గా సాగుతున్న టైమ్ అది. ఫ్యాన్స్ అంతా ఒక సాలిడ్ హిట్ కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఇక సరిగ్గా అప్పుడే దర్శకుడు హరీష్ శంకర్ ఎంట్రీ ఇచ్చారు. పవన్ కళ్యాణ్ స్వాగ్‌ను, ఇమేజ్‌ను పర్ఫెక్ట్ గా వాడుకుంటూ ఆయన చేసిన మ్యాజిక్కే 'గబ్బర్ సింగ్' (2012)మూవీ. ఇక థియేటర్లలో మాస్ ఎలివేషన్లతో రచ్చ లేపిన ఈ సినిమా, ఇండస్ట్రీ హిట్ గా నిలిచి పవన్ కు గ్రాండ్ కం బ్యాక్ ఇచ్చింది.

**బాలయ్య మాస్ పవర్ చూపించిన 'అఖండ':**

నందమూరి బాలకృష్ణకు మాస్ లో ఉన్న ఫాలోయింగ్ ప్రత్యేకమైనది. అయితే 'కథానాయకుడు', 'మహానాయకుడు', 'రూలర్' వంటి వరుస ఫ్లాపులతో ఆయన కెరీర్ కాస్త ఇబ్బందుల్లో పడింది. అలాంటి టైంలో బాలయ్య నమ్మకమైన దర్శకుడు బోయపాటి శ్రీను రంగంలోకి దిగారు. ఇక వీరిద్దరి కలయికలో వచ్చిన 'అఖండ' (2021) టాలీవుడ్ ను ఊపేసింది. అఘోరా పాత్రలో బాలయ్య విశ్వరూపం, బోయపాటి హై-వోల్టేజ్ యాక్షన్ సీన్లు సినిమాను బ్లాక్ బస్టర్ గా నిలబెట్టాయి.

**నాగార్జున ట్రెండ్ సెట్టర్ 'శివ':**

అక్కినేని నాగార్జున కెరీర్ మొదట్లో 'నిర్ణయం', 'చైతన్య' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడలేదు. కెరీర్ కాస్త డీలా పడిన తరుణంలో, ఒక కొత్త దర్శకుడు టాలీవుడ్ హిస్టరీని తిరగరాశాడు. ఆయనే రామ్ గోపాల్ వర్మ. 1989లో వచ్చిన 'శివ' సినిమా అప్పటివరకు ఉన్న కమర్షియల్ ట్రెండ్‌ను పూర్తిగా మార్చేసింది. ఇక సైకిల్ చైన్ సీన్, రియలిస్టిక్ యాక్షన్ తో ఈ సినిమా నాగార్జునను రాత్రికి రాత్రే యూత్ ఐకాన్ గా మార్చేసింది.

**రవితేజ ఎనర్జీని పెంచిన 'క్రాక్':**

మాస్ మహారాజా రవితేజ వరుసగా 'టచ్ చేసి చూడు', 'నేల టిక్కెట్టు', 'అమర్ అక్బర్ ఆంథోనీ' వంటి డిజాస్టర్లతో ఫామ్ కోల్పోయారు. ఆయన ఎనర్జీకి తగ్గ హిట్ పడట్లేదని ఫ్యాన్స్ ఫీల్ అవుతున్నప్పుడు, దర్శకుడు గోపీచంద్ మలినేని తోడుండటంతో సీన్ మారింది. ఇక 2021లో వచ్చిన 'క్రాక్' సినిమాలో పోతురాజు వీరశంకర్ గా రవితేజ పవర్ఫుల్ పోలీస్ క్యారెక్టర్ లో అదరగొట్టారు. ఈ సినిమా రవితేజ కెరీర్ లోనే బెస్ట్ హిట్లలో ఒకటిగా నిలిచింది.

**ఎన్టీఆర్ బాక్సాఫీస్ వేట 'జనతా గ్యారేజ్':**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ కు నటనలో తిరుగులేదు, కానీ 'రామయ్యా వస్తావయ్యా', 'రభస' వంటి సినిమాలు నిరాశపరచడంతో ఆయన మార్కెట్ పై ప్రభావం పడింది. ఆ సమయంలో దర్శకుడు కొరటాల శివ ఎన్టీఆర్ కు ఒక డిఫరెంట్ స్క్రిప్ట్ ఇచ్చారు. అదే 'జనతా గ్యారేజ్' (2016). ఎన్టీఆర్‌ను కేవలం మాస్ హీరోగానే కాకుండా, పర్యావరణంపై బాధ్యత ఉన్న పాత్రలో చాలా హుందాగా చూపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి, ఎన్టీఆర్ కు ఘనవిజయాన్ని అందించింది.

వరుస ఫ్లాపులు వచ్చినా, సరైన కథ మరియు దర్శకుడు దొరికితే హీరోల క్రేజ్ మళ్లీ ఎక్కడికో వెళ్తుందని ఈ సినిమాలు నిరూపించాయి. టాలెంట్ ఉన్న దర్శకులు హీరోల ఇమేజ్ కు తగ్గట్టుగా ప్లాన్ చేస్తే థియేటర్లలో ఎలాంటి సంచలనాలు సృష్టించవచ్చో ఈ కాంబినేషన్లే మనకు బెస్ట్ ఎగ్జాంపుల్స్. అందుకే సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరి టైమ్ మారుతుందో చెప్పడం కష్టం.



బీచ్‌లో సూర్యాస్తమయ కాంతిలో శమా సికందర్ ఆకర్షణీయమైన రూపం

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965